ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

శుక్రవారం 6 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 141 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

విదేశీ పౌరులకు కేంద్రం భారీ ఊరట!

పాస్‌పోర్ట్, వీసా నిబంధనల్లో కీలక సడలింపులు

పాక్ పౌరులు, మైనార్టీ శరణార్థులు, శ్రీలంక తమిళులు, టిబెటన్లకు ప్రత్యేక వెసులుబాటు



2



దేశాన్ని గర్వపడేలా చేశారు

ఆసియా గేమ్స్ పారా అథ్లెట్లపై ప్రధాని మోదీ ప్రశంసలు

2



కాళేశ్వరం బ్యారేజీలకు పునరుజ్జీవం!

డిసెంబర్ నుంచే పునరుద్ధరణ పనులు

మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.4,193 కోట్ల అంచనాలు

నిర్మాణ లోపాల మరమ్మతుల ఖర్చు కాంట్రాక్ట్ సంస్థలదే

నెలాఖరులోగా కేంద్రం నుంచి తుది అనుమతులు

దేవాదుల, సీతారామ ద్వారా 24.81 టీఎంసీల గోదావరి జలాల వినియోగం

2



కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లో మంత్రులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ తప్పిదాలు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేస్తూ.. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ కేంద్ర సంస్థల మార్గదర్శకాలకు లోబడి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నెలాఖరులోగా కేంద్రం నుంచి తుది అనుమతులు పూర్తి చేసుకుని, డిసెంబర్ నుంచే క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని స్పష్టమైన డెడ్‌లైన్ విధించారు.

-హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)

ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు!

ప్రతి ప్రతినిధికి ప్రత్యేక లైజనింగ్ అధికారి.. భద్రతకు అత్యంత ప్రాధాన్యత

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026

నవంబర్ 15లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం ఆదేశం

గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

2

తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ప్రత్యేకంగా ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని సీఎం సూచించారు.

-హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)



శ్రీశైలం డెడ్ స్టోరేజీ నుంచీ సాగునీరు!

ఎస్ఎల్‌బీసీ పూర్తయితే లక్ష ఎకరాలకు నీరందిస్తాం

రెండేళ్లలో జిల్లాలో మట్టి రోడ్డు లేకుండా చేస్తాం

బ్రాహ్మణ వెల్లెంల ద్వారా ఇప్పటికే 35 వేల ఎకరాలకు నీరు

ఎస్ఎల్‌బీసీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి: మంత్రి కోమటిరెడ్డి

2

రాష్ట్రంలో ఎంత కరువొచ్చినా శ్రీశైలం డెడ్ స్టోరేజ్ నుంచి రైతులకు సాగునీరివ్వొచ్చని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పూర్తయితేనే ఇది సాధ్యమన్నారు. లక్ష ఎకరాలకు సాగునీరు అందించొచ్చని చెప్పారు. నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కంకణం కట్టుకున్నానన్నారు.

నల్గొండ, నవంబర్ 5 (సింగిడి)

ఆరు నెలలు.. 355 రకాల పనులు!

గ్రామీణ ఉపాధి, జలవనరుల పునరుద్ధరణే లక్ష్యం

2027 జనవరి నుంచి జూన్ వరకు ప్రత్యేక కార్యక్రమం

ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేసేలా కార్యాచరణ

చెరువులు, కుంటలు, కాలువల్లో పూడికతీత

భూగర్భ జలాల పెంపునకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం



జలవనరుల పునరుద్ధరణతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 2027 జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

2

-హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)



అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

రాహుల్ గాంధీ

ఇటీవల కొల్హాపూర్‌లో జరిగిన గోకుల్ మిల్క్ కోఆపరేటివ్ ఎన్నికల్లో తీర్పును తారుమారు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని మహారాష్ట్రలోని మహాయుతి కూటమిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది.

-న్యూఢిల్లీ, నవంబర్ 5 (సింగిడి)

2

చర్చకు సిద్ధం..

రాహుల్‌కు అమిత్ షా సవాల్..

ప్రధానికి అధికారికంగా లేఖ రాయాలని సూచన

ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారులపై ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలకూ సై

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన

ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు

చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ

బిల్డర్లు, డెవలపర్లకు విషయం తెలుసన్న కేటీఆర్

విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ



తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ అగ్రనేతలు ఆరోపణలు చేస్తున్నారే తప్ప చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు.

2

-హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)

ఏపీలో ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్

21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం

రాష్ట్రవ్యాప్తంగా 65–68 శాతం పోలింగ్ నమోదైనట్లు అంచనా

మధ్యాహ్నం 3 గంటల వరకు 58.55 శాతం ఓటింగ్

పల్నాడు, అనంతపురం సహా పలు ప్రాంతాల్లో ఘర్షణలు

నవంబర్ 7న ఓట్ల లెక్కింపు.. అదే రోజు ఫలితాలు



ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల సమరంలో కీలక ఘట్టమైన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కారణంగా ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా, మధ్యాహ్నం నుంచి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. చెదురుమదురు ఘర్షణలు, వాగ్వాదాలు మినహా పోలింగ్ ప్రక్రియ చాలా వరకు ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం 5 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు రాష్ట్రవ్యాప్తంగా 58.55% పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

- అమరావతి, నవంబర్ 5 (సింగిడి)

2

సగానికి పైగా తగ్గనున్న మెట్రో-ఆర్టీసీ పాస్ ధరలు!

కామన్ పాస్ ధరలను తగ్గించనున్న తెలంగాణ ప్రభుత్వం

ప్రస్తుత ధరలు అధికంగా ఉన్నాయన్న ఫీడ్‌బ్యాక్‌తో ఈ నిర్ణయం

రోజువారీ పాస్‌ను రూ.400 నుంచి రూ.325కి తగ్గించే అవకాశం

నెలవారీ పాస్‌ను రూ.8,500 నుంచి రూ.4,000-4,500 మధ్యకు తగ్గింపు



డోర్లు మూస్తేనే బస్సు ముందుకు!

ప్రవళిక మృతితో అన్ని బస్సులకు డోర్లు తప్పనిసరి చేసిన ఆర్టీసీ

డోర్లు మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశాలు

డోర్లు లేని బస్సులకు వెంటనే తలుపులు ఏర్పాటు చేయాలని సూచన

టికెట్ వివాదంలో ప్రయాణికురాలు నెట్టడంతో ప్రవళికకు తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయిన మహిళా కండక్టర్

2

మహిళా కండక్టర్ ప్రవళిక మృతి తెలంగాణ ఆర్టీసీలో కీలక మార్పుకు దారితీసింది. ప్రయాణికుల భద్రతతో పాటు సిబ్బంది రక్షణకు సంస్థ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ఇకపై ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే అన్ని బస్సులకు తప్పనిసరిగా డోర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

-హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)



బీసీ ఆత్మగౌరవ భవనాలకు భారీగా నిధులు

హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల భవనాలకు నిధులు

ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం రూ. 88.50 కోట్లు మంజూరు

ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం

భూములు వెనక్కి తీసుకుంటారనే ప్రచారంలో నిజం లేదని స్పష్టీకరణ

నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంఘాలదే బాధ్యత: మంత్రి పొన్నం హెచ్చరిక

2

జనరల్ న్యూస్ సింగిడి

ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు!



తెలంగాణ పర్యాటక రంగానికి ప్రాధాన్యత

విమానాశ్రయానికి ప్రతినిధులు చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సమావేశానికి ముందుగానే వారికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేశారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు భద్రతా అధికారిని నియమించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమ్మిట్ నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.

ముఖ్యమంత్రులను ఆహ్వానించాలి

తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసేలా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. పర్యాటక రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా సమ్మిట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక చర్చ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ విద్యా రంగ ప్రగతిని నర్సరీ నుంచి ఆక్స్‌ఫర్డ్ స్థాయి వరకు ప్రతిబింబించేలా విద్యా వ్యవస్థపై సమ్మిట్‌లో చర్చలు ఉండాలని ఆకాంక్షించారు. గ్లోబల్ సమ్మిట్‌కు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సీఎం సూచించారు. నవంబర్ 15వ తేదీలోగా సమ్మిట్‌కు సంబంధించిన సమగ్ర ఏర్పాట్ల ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు గడువు విధించారు. తెలంగాణ ప్రతిష్టను ప్రపంచ వేదికపై మరింత ఇనుమడింపజేసేలా గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పండుగ

మరోవైపు దీపావళి వేళ ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారులతో పండుగ జరుపుకుంటానని, లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో పాలుపంచుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో పండుగ చేసుకోవాలని ఆదేశించారు.

కాళేశ్వరం బ్యారేజీలకు పునరుజ్జీవం!

మేడిగడ్డ కుంగుబాటు అనంతరం మూడు బ్యారేజీలపై జాతీయ స్థాయి నిపుణులతో నిర్వహించిన సమగ్ర అధ్యయనం ఆధారంగా దాదాపు రూ.4,193 కోట్ల అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి కేంద్ర నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. అయితే ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం పక్కా ప్రణాళిక రచించింది. గతంలో జరిగిన నిర్మాణ లోపాల వల్ల చేపట్టాల్సిన మరమ్మతుల ఖర్చు మొత్తాన్ని ఆయా నిర్మాణ సంస్థలే భరించేలా, భవిష్యత్ అవసరాల కోసం చేపట్టే అదనపు రక్షణ పనుల ఖర్చును మాత్రమే ప్రభుత్వం భరించేలా నిర్ణయించారు. నీటి నిల్వ సామర్థ్య పునరుద్ధరణ, భద్రతా పనులను రెండు దశల్లో సమాంతరంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. మేడిగడ్డ వద్ద నీరు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా లిఫ్ట్ చేయడం లేదంటూ జరుగుతున్న ప్రచారంలోని వాస్తవాలను ఇంజనీర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మేడిగడ్డ నుంచి నీటిని లిఫ్ట్ చేసి ఎల్లంపల్లికి చేర్చాలంటే మధ్యలో ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తప్పనిసరిగా మూసివేయాల్సి ఉంటుంది. అయితే ఈ రెండింటిలోనూ తీవ్ర నిర్మాణ లోపాలు ఉన్నందున, గేట్లను ఎట్టిపరిస్థితుల్లోనూ మూయవద్దని, పూర్తిగా తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్‌ఏ కచ్చితమైన హెచ్చరికలు జారీ చేసింది. ఆ ఆదేశాలను ఉల్లంఘించి గేట్లు మూస్తే బ్యారేజీల మనుగడకే పెను ప్రమాదం వాటిల్లే అవకాశం ఉండటంతోనే సాంకేతికంగా నీటిని లిఫ్ట్ చేయడం సాధ్యం కాలేదని అధికారులు తేల్చిచెప్పారు.

దేవాదుల, సీతారామ ద్వారా రికార్డు స్థాయిలో గోదావరి జలాల వినియోగం

ఎగువ బ్యారేజీల సమస్యలను అధిగమిస్తూనే దిగువ గోదావరి జలాలు వృథా కాకుండా ప్రభుత్వం సమర్థవంతమైన కార్యాచరణను అమలు చేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గోదావరి నీటిని పూర్తిస్థాయిలో ఒడిసిపట్టింది. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని మాత్రమే లిఫ్ట్ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం ఏటా సగటున 18.13 టీఎంసీలను లిఫ్ట్ చేసింది. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు వెరసి మొత్తం 24.81 టీఎంసీల గోదావరి నీటిని ఒడిసిపట్టి ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగు, తాగునీటి కొరత లేకుండా అందించింది. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వినియోగించుకోవడం ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని సీఎం పేర్కొన్నారు.



శ్రీశైలం డెడ్ స్టోరేజీ నుంచీ సాగునీరు!

నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే రెండేళ్లలో జిల్లాలో మట్టి రోడ్డు లేకుండా చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల పదవులు అత్యంత కీలకమైనవి. రైతులకు సంబంధించి ఈ పదవులకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. రైతులకు సేవ చేసే అవకాశం వీటి ద్వారా లభిస్తుంది. నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలి. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నల్లగొండ మార్కెట్‌కు సంబంధించి రెండవ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరం. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్తును ప్రస్తుతం అన్ని రాష్ట్రాలలో అమలు చేస్తున్నాయి. ఇది గర్వకారణం. ఎస్ఎల్బీసీ ద్వారా ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించడమే కాకుండా జిల్లా అంతటికి సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో 2000 కోట్ల రూపాయలతో చేపట్టిన ఎస్ఎల్బీసీ ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయాయి. ప్రజాపాలన ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులను తిరిగి చేపట్టాం. దుర దృష్టవశాత్తు మధ్యలో మళ్లీ పనులు ఆగగా ఇటీవలే తిరిగి ప్రారంభించాం. చురుకుగా కొనసాగుతున్నాయి. బ్రాహ్మణ వెల్లేములను కూడా తమ హయాంలోనే చేపట్టాం. ఇప్పటివరకు 35000 ఎకరాలకు సాగునీరు అందించాం. లక్ష ఎకరాలకు తాగునీటిని అందించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. రైతులకు సేవ చేయడం ప్రతి ఒక్కరూ అదృష్టంగా భావించాలి. ఏఎంఆర్పీ కాలువల లైనింగును 450 కోట్ల రూపాయలతో చేపట్టాం. ముశంపల్లి సబ్ స్టేషన్, రోడ్డు మంజూరు చేయించాం. జిల్లాలో కాలువలు, రిజర్వాయర్లు పూర్తయితే చుట్టుపక్కల బోర్లు రీఛార్జ్ అవుతాయి. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నాం. రాష్ట్ర ప్రజలకు ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తున్నా అని మంత్రి కోమటిరెడ్డి తెలియజేశారు. అంతకుముందు నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బీ హేమలత వెంకటరెడ్డి, వైస్ చైర్మన్‌గా వి.శ్రీనివాస్ గౌడ్‌తో పాటు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఛాయాదేవి వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భవనాలకు భారీగా నిధులు

హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)

వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో 38 బీసీ కుల సంఘాల కోసం 'ఆత్మగౌరవ భవనాల' నిర్మాణానికి రూ. 88.50 కోట్లు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) పత్రాలను అందజేశారు. అన్ని కులాల సామాజిక, సాంస్కృతిక, విద్యాభివృద్ధి లక్ష్యంగా ఈ భవనాల నిర్మాణాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. గతంలో భూములు కేటాయించినప్పటికీ, కొన్ని పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) సహకారంతో ఇప్పుడు ఆ అడ్డంకులన్నీ తొలగిపోయాయని చెప్పారు. స్థలాలను 'రెడీ-టు-కన్‌స్ట్రక్ట్' పద్ధతిలో లేఅవుట్లతో అభివృద్ధి చేశామని, ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసినందున కుల సంఘాలు తక్షణమే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.

సంవత్సరంలోగా ఈ భవనాల నిర్మాణాలు పూర్తి చేసి బీసీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణాలకు అవసరమైన అన్ని అనుమతులను ఇంజనీరింగ్ విభాగం, హెచ్ఎండీఏ సమన్వయంతో 'సింగిల్ విండో' విధానంలో జాప్యం లేకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణాల పురోగతిపై బీసీ సంక్షేమ శాఖ ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తుందని తెలిపారు.

బీసీ కుల సంఘాలకు కేటాయించిన ప్లాట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ వస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు. ఈ భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటిని ఏ ప్రభుత్వం వెనక్కి తీసుకోదని భరోసా ఇచ్చారు. కేటాయించిన నిధులతో నిర్దిష్ట సమయంలోగా భవనాలను పూర్తి చేయాల్సిన బాధ్యత ఆయా సంఘాలపై ఉందని, జాప్యం జరిగితే సంఘాల ప్రతినిధులనే జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు. అన్ని బీసీ కుల సంఘాలు సమావేశాలు, జయంతులు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలంలో ఒక సమగ్ర 'బీసీ భవన్' నిర్మించాలనే ప్రతిపాదనను కూడా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్తావించారు.

సగానికి పైగా తగ్గనున్న మెట్రో-ఆర్టీసీ పాస్ ధరలు!

హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)

హైదరాబాద్ నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000 – రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు. ఇది అమలైతే నెలవారీ పాస్ ధర దాదాపు సగానికి తగ్గుతుంది. ఈ ఉమ్మడి పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పాస్ ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో మెట్రో రైళ్లు, ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ ఏసీ సర్వీసులు మినహా) అపరిమితంగా ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. నగరంలో ప్రజా రవాణాను ప్రోత్సహించి, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ పాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే, ధరలు ఎక్కువగా ఉండటంతో ఆ లక్ష్యం నెరవేరలేదు. ధరల సవరణపై ఇప్పటికే మెట్రో, ఆర్టీసీ అధికారులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతో జరగనున్న తదుపరి సమావేశాల అనంతరం కొత్త ధరలపై పూర్తి స్పష్టత రానుంది. ఈ నిర్ణయంతో కామన్ పాస్‌ను వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి ఇది దోహదపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

ఆరు నెలలు.. 355 రకాల పనులు!

జలవనరుల పునరుద్ధరణతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు 2027 జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. సెక్రెటేరియట్‌లో గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాబోయే వర్షాకాలానికి ముందుగా ఆరు నెలలపాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. గ్రామస్తులను, ముఖ్యంగా వ్యవసాయ కూలీలను పెద్దఎత్తున భాగస్వాములను చేయాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు.

దేశాన్ని గర్వపడేలా చేశారు

ఆసియా గేమ్స్ పారా అథ్లెట్లపై ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబర్ 5 (సింగిడి)

జపాన్‌లో జరిగిన ఆసియా పారా గేమ్స్ 2026లో భారత పారా అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పారా గేమ్స్‌లో మన అథ్లెట్లు చూపిన అద్భుత ప్రదర్శన, ప్రపంచ క్రీడల్లో భారతదేశం ఒక ప్రధాన శక్తిగా ఎదుగుతోందనడానికి ఒక నిదర్శనమని కొనియాడారు. 2010లో ఒక స్వర్ణంతో సహా 14 పతకాలను సాధించిన భారత్, ఈ ఏడాది ఏకంగా 114 పతకాలను సాధించిందని, ఈ ఘనతకు అథ్లెట్ల అంకితభావం, బలపడిన క్రీడా వ్యవస్థే కారణమని చెప్పారు. గురువారం దిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పారా అథ్లెట్లతో కలిసి మోదీ ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. "మిమ్మల్ని అందరినీ కలవాలని నేను ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. కొన్ని వారాల క్రితం నేను ఆసియా క్రీడల అథ్లెట్లను కలిశాను. ఈరోజు ఆసియా పారా గేమ్స్‌లో పాల్గొన్న మిమ్మల్ని కలిసే అవకాశం నాకు లభించింది. పారా గేమ్స్‌లో మీరు చూపిన అద్భుతమైన ప్రదర్శన, క్రీడా ప్రపంచంలో భారతదేశ శక్తిని ప్రతిబింబిస్తుంది. ఒకప్పుడు అంతర్జాతీయ క్రీడల్లో భారతదేశం పాల్గొనడం అనేది చాలా తక్కువగా ఉండేది. అంతేకాదు, పారా క్రీడల్లో మన దేశం చాలా వెనుకబడి ఉండేది. 2010 ఆసియా పారా క్రీడల్లో భారత్ కేవలం ఒక స్వర్ణ పతకంతో సహా మొత్తం 14 పతకాలు మాత్రమే గెలుచుకుంది. అయితే ఈసారి జరిగిన పారా క్రీడల్లో మన క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శన చూపి మొత్తం 114 పతకాలు సాధించారు. 14 నుంచి 114 పతకాల వరకు సాగిన ఈ ప్రయాణం మీ(పారా అథ్లెట్లు) కఠోర శ్రమ, అచంచలమైన అంకితభావం, పటిష్ఠమైన వ్యవస్థే కారణం. మొత్తం 30 స్వర్ణాలు, 35 రజతాలు, 49 కాంస్య పతకాలతో పాటు 5 కొత్త ప్రపంచ రికార్డులు, 9 ఆసియా రికార్డులతో మీరు యావత్ దేశాన్ని గర్వపడేలా చేశారు.

డోర్లు మూస్తేనే బస్సు ముందుకు!

డోర్లు పూర్తిగా మూసిన తర్వాతే బస్సులు కదలాలని ఆదేశించింది. డోర్లు లేని బస్సులను గుర్తించి వెంటనే వాటిని అమర్చాలని అధికారులకు సూచించింది. ఆర్టీసీ పరిధిలోని అన్ని రకాల బస్సులకు ఈ నిబంధన వర్తించనుంది. ఇప్పటివరకు డోర్లు లేకుండా నడుస్తున్న బస్సులను గుర్తించి తక్షణమే తలుపులు ఏర్పాటు చేయాలని సంస్థ ఆదేశించింది. ఇకపై బస్సు బయలుదేరే ముందు డోర్లు మూసి ఉన్నాయో లేదో సిబ్బంది నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. ప్రవళిక మృతి నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళిక విధుల్లో ఉండగా టికెట్ విషయంలో ఓ మహిళా ప్రయాణికురాలితో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో ప్రయాణికురాలు ఆమెను బస్సు నుంచి బయటకు నెట్టివేయడంతో ప్రవళిక కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన ఆర్టీసీ వర్గాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ప్రవళిక కుటుంబాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వం,

బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన

హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు. ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు.

ఏపీలో ముగిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్

పోలింగ్ ముగిసే సమయానికి ఈ శాతం 65 నుంచి 68 శాతం మధ్య ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనగా, కొన్ని గిరిజన, తీర ప్రాంతాల్లో పోలింగ్ శాతం కాస్త తక్కువగా నమోదైనట్లు సమాచారం. ఈ ఎన్నికల బరిలో నిలిచిన సుమారు 21,012 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 77 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగానే సాగినప్పటికీ, పల్నాడు, అనంతపురం, చంద్రగిరి, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్ బాంబులతో దాడులు జరిగాయి. కొన్ని చోట్ల ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో దాడులకు దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనల వల్ల పోలింగ్‌కు పెద్దగా అంతరాయం కలగలేదు. పోలింగ్ ముగిసిన వెంటనే అధికారులు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు సీళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. ఏవైనా కేంద్రాల్లో తీవ్రమైన అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ అయితే, నవంబర్ 6న అక్కడ రీ-పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. షెడ్యూల్ ప్రకారం, నవంబర్ 7వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి, అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. ఈ

అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుంది

ఇటీవల కొల్హాపూర్‌లో జరిగిన గోకుల్ డెయిరీ కోఆపరేటివ్ ఎన్నికల్లో ప్రజా తీర్పును తారుమారు చేయడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. డైరెక్టర్ల బోర్డులో మెజారిటీని దక్కించుకోవడానికి ఎన్నికల తర్వాత నిబంధనలను మార్చిందని దుయ్యబట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు.

13 స్థానాల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ

మరోవైపు, ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా చేసిన ఎక్స్ పోస్టు రాహుల్‌గాంధీ ట్యాగ్ చేశారు. అందులో, ఒక ఎన్నిక ముగిసిన తర్వాత, ఫలితం నచ్చలేదనే కారణంతో ప్రభుత్వం నిబంధనలను ఎలా మారుస్తుందని ఖేడా ప్రశ్నించారు. ప్రతిపాదిత మార్పులపై ఆయన మహారాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాన్ని, సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడటానికి తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నట్లు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

'తీర్పును తారుమారు చేసే అవకాశం ఉంది'

ఎన్నికైన బోర్డును సజావుగా పనిచేయనివ్వకుండా, మహారాష్ట్ర క్యాబినెట్ బుధవారం ఒక కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని పవన్ ఖేడా ఆరోపించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకును మినహాయించి రూ. 500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ ఉన్న సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించాలని నిర్ణయం తీసుకుందన్నారు.

చర్చకు సిద్ధం.. రాహుల్‌కు అమిత్ షా సవాల్..

హైదరాబాద్, నవంబర్ 5 (సింగిడి)

ఎస్ఐఆర్, ఈవీఎంల వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ చర్చకు రావాలంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విసిరిన సవాల్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. రాహుల్‌కు నిజంగానే చర్చించాలనే చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ప్రధాన మంత్రికి అధికారికంగా లేఖ రాయాలని సూచించారు. ఎస్ఐఆర్, ఈవీఎంలు, చొరబాటుదారుల అంశాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హరియాణాలోని కర్నాల్‌లో బీజేపీ నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అర



రౌడీ షీటర్ల కదలికలపై పోలీసులు నిఘా

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05: (సింగిడి)

బుధవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల ఇళ్లను, వారి కదలికలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా ప్రస్తుత కార్య కలాపాలు, జీవన విధానం, కదలికలపై ఆరా తీసి ,భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ, సత్ప్రవర్తనతో జీవించాలని కౌన్సెలింగ్ నిర్వహించారు.ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజా జీవనానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే హెచ్చరించారు.రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజలను భయభ్రాంతు లకు గురిచేసినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నేరాలకు దూరంగా ఉంటూ,సత్ప్రవర్తనతో జీవిస్తున్న వారిని గుర్తించి నిబంధనల ప్రకారం షీట్ల తొలగిం పునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలీస్ అధికారులు సూచించిన సమయాల్లో సంబంధిత వ్యక్తులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌కు హాజరుకావాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై బైండోవర్ చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటారని, నేరాలకు పాల్పడే వారు ఎంత టివారైనా చట్టపరంగా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎస్పీ హెచ్చరించారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో సకల సౌకర్యాలు



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05: (సింగిడి):

కొనరావుపేట,ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రజా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. కోనరావుపేట మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56 లక్షలతో నూతన వసతి గృహం, టాయిలెట్స్, రూ. 9 లక్షల 50 వేలతో భవిత కేంద్ర నిర్మాణానికి, రూ. 30 లక్షలతో ఐకేపీ గోడౌన్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించగా... ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేము లవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై శిలాఫలకాన్ని కాలనీ ఆవి ష్కరించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.ప్రజా ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నూతన తరగతి, వసతి గదులు, మౌలిక వసతుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నదని వివరించారు. అలాగే అన్ని విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులకు కాస్మోటిక్, డైట్ చార్జీలు పెంచిందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, అలాగే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నిర్మించనున్నదని అని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసిందని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటూ ముందుకు సాగుతుంది స్పష్టం చేశారు. విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలని, మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. త్వరితగతిన పూర్తి చేయాలికేజీబీవీ, భవిత సెంటర్, ఐకేపీ గోడౌన్ నిర్మాణ పనులను త్వరితగతిన మొదలుపెట్టి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఆయా పనులు ప్రణాళిక ప్రకారం పూర్తి చేసి అందుబా టులోకి తీసుకురావాలని సూచించారు. రూ. 30 లక్షలతో ఐకేపీ గోడౌన్ .కోనరావుపేట మండల కేంద్రంలో రూ. 30 లక్షలతో ఐకేపీ గోడౌన్ నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం భూమి పూజ చేశారు. గోడౌన్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఫ్యాక్స్ ఛైర్మెన్లు చేపూరి గంగాధర్, బొమ్మేన భాస్కర్ రావు, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, కోనరావుపేట సర్పంచ్ కాశిరామ్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బోయిని దేవరాజుతహసీల్దార్ వరలక్ష్మి , ఎంపీడీఓ స్నిగ్ధ, జీసీడీఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 05:(సింగిడి)



ప్రభుత్వ సాధారణ వైద్యశాల తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలోని స్థానిక పద్మశాలి సంఘంలో మనోవికాస సదస్సును నిర్వహించారు.సైకాలజిస్ట్ పున్నం చందర్ కనుకుంట్ల పాల్గొని మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.మానసిక సమ స్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి తగిన కౌన్సెలింగ్, చికిత్స తీసుకోవా లని తెలిపారు.మద్యపాన వ్యసనం గురించి మాట్లాడుతూ మద్యపానం వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితులు, కుటుంబ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు.ఒత్తిడిని తగ్గించుకోవడానికి మద్యపానాన్ని ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, వ్యస నానికి గురైన వారు నిపుణుల సహాయంతో చికిత్స తీసుకోవాలని సూచించారు.పని ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యల వల్ల మానసిక ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు. సమస్యలను మనసులోనే దాచుకోకుండా కుటుంబ సభ్యులతో, స్నేహితులతో పంచు కోవాలని, అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోవాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్య లకు ఆత్మహత్య పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు ఏదో ఒక పరిష్కారం ఉంటుందని తెలిపారు. ఆత్మహత్య ఆలోచనలు కలిగిన వ్యక్తులను ఒంటరిగా వదిలేయకుండా వారితో మాట్లాడి, ధైర్యం చెప్పి, వెంటనే నిపుణుల సహాయం అందించాలని కోరారు. కమ్యూనిటీ ఫెసిలి టేటర్ వేముల మార్కండేయులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. సర్పంచ్ గడ్డం రచన మధుకర్, పద్మశాలి సంఘం అధ్యక్షుడు బల్ల లక్ష్మీపతి, కార్యదర్శి మాదాసు సత్యనారాయణ, గౌడ రాజమహేందర్, మాసం రాజేందర్, భోగ రంగయ్య, జెల్ల సదానందం, కొండి సంపత్, చింతకింది శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి

అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఆటంకాలు!

-వనపర్తి మున్సిపాలిటీలో పాటు మూడు చోట్ల అదనపు బాధ్యతలు..
-సిబ్బంది కొరతతో పాలనపై ప్రభావంఖాళీ పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యమెందుకు?
-పనుల నాణ్యత పెరగాలంటే పర్మినెంట్ అధికారులు ఉండాల్సిందే!



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 5 (సింగిడి)

ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ఉన్న అధికారులపైనే అదనపు బాధ్యతలు మోపుతూ పాలనను నెట్టుకొస్తున్న తీరు అభివృద్ధి పనులపై ప్రభావం చూపే ప్రమాదం కలిగిస్తోంది. ఒకవైపు సిబ్బంది కొరత.. మరోవైపు పెరుగుతున్న పనుల భారం.. ఇంకోవైపు పర్యవేక్షణ బాధ్యతలు.. వెరసి అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి నెలకొంది. వనపర్తి మున్సిపాలిటీలో డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్ (డీఈ) గా విధులు నిర్వహి స్తున్న వినోద్ కుమార్‌కు పలు ప్రాంతాల్లో అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఈ పరిస్థితి చర్చనీ యాంశంగా మారింది.వినోద్ కుమార్ వనపర్తి మున్సిపాలిటీతో పాటు మహబూబ్‌నగర్‌లోని మూడా విభాగంలో డీఈగా, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో డీఈగా, వనపర్తి లోని పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో డీఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవ డంతో ఒకే అధికారి పలు కార్యాలయాల బాధ్యతలు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.–నాలుగు చోట్ల బాధ్యతలు.. పర్యవేక్షణ ఎలా?మున్సిపాలిటీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, నిర్మాణాల నాణ్యత పరిశీలన వంటి కీలక బాధ్యతలను ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిం చాల్సి ఉంటుంది. పనులు జరుగుతున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించడం, కాంట్రాక్టర్ల పనితీరును పరిశీలించడం, బిల్లులు, అంచనాలు, సాంకేతిక అంశాలను తనిఖీ చేయడం వంటి విధులు ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒకే అధికారి నాలుగు ప్రాంతాల బాధ్యతలు నిర్వహిస్తే అన్ని చోట్లా సమయానికి పర్యవేక్షణ సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.–ఖాళీ పోస్టులు భర్తీ చేయరా?ప్రభుత్వం పట్టణాల అభివృ ద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నామని చెబు తున్నప్పటికీ ఆ పనులను పర్యవేక్షించాల్సిన కీలక ఇంజినీరింగ్ పోస్టులను భర్తీ చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తు న్నాయి. అధికారులు లేకపోవడంతో అదనపు బాధ్యతలు అప్పగించడం తాత్కాలిక ప్రత్యామ్నాయం కావొచ్చేమో కానీ, అదే శాశ్వత పరిష్కారంగా మారితే పాలనాపరమైన సమస్యలు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.–వన పర్తి పబ్లిక్ హెల్త్ కార్యాలయంలోనూ అధికారుల కొరత!వనపర్తిలోని పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయంలోనూ పూర్తిస్థాయి అధికారులు అందుబాటులో లేకపో వడం సమస్యగా మారింది. తాగునీటి సరఫరా, పైప్‌లైన్లు, నీటి శుద్ధి, ఇతర ఇంజినీరింగ్ పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులు ఉండాల్సిన అవసరం ఉంది. ఒకే అధికారిపై పలు బాధ్యతలు మోపడం వల్ల క్షేత్రస్థాయి పర్యవేక్షణకు తగిన సమయం కేటాయించగలరా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యాలయంలో డిఈ పోస్ట్ ఖాళీగా ఉండడంతో వినోద్ కుమార్ కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ముగ్గురు ఏఈ లు ఉండాలి కానీ ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఏఈ పోస్టులు రెండు శాంక్షన్ లో ఉన్న భర్తీ చేయలేదు. మహబూబ్ నగర్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ లో ఏఈగా పనిచేస్తున్న చంద్రశేఖర్ కు వనపర్తి పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏఈగా, పెబ్బేరు మున్సి పాలిటీలో ఏఈగా అదనపు బాధ్యతలు అప్పగిం చారు. జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు శాంక్షన్ లో ఉన్న భర్తీ చేయలేదు. జూనియర్ అసిస్టెంట్ ను ఔట్సోర్సింగ్ లో తీసుకు న్నారు–బాధ్యతలు పెంచితే నాణ్యత పెరుగు తుందా?ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. పనులు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటేనే నాణ్యతా ప్రమాణాలు పాటించే అవకాశం ఉంటుంది. కానీ అధికారుల కొరతను భర్తీ చేయకుండా ఉన్న అధి కారులకే అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ఆశించిన స్థాయిలో పర్యవేక్షణ జరుగుతుందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.–ప్రభుత్వం దృష్టి సారించాలిము న్సిపల్ శాఖ, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజి నీరింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచే సేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఖాళీగా ఉన్న డీఈ, ఏఈ తదితర కీలక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రతి కార్యాలయానికి పూర్తిస్థాయి అధికా రులను నియమించి అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఆటంకాలు లేకుండా చూడాలి. అదనపు బాధ్యతల పేరుతో పాలనను తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం చేయకుండా శాశ్వత నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు

జగదాంబ తండా అభివృద్ధికి రూ.30 లక్షలు

లింగంపేట: నవంబర్ 05 (సింగిడి)



ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎమ్మెల్యే మదన్ మోహన్ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా లింగంపేట మండలం జగదాంబ తండా గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన నూతన భవనాలను ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రారంభిం చారు.గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, మహిళా సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు వెచ్చించి మొత్తం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలను ప్రారంభించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకొ చ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సహకరించి భవనాల నిర్మాణా నికి స్థలం దానం చేసిన దాతను ప్రత్యేకంగా అభి నందించారు. గ్రామంలో అభివృద్ధి పనులను ముందుండి నడిపిస్తూ భవనాలు, సీసీ రోడ్ల నిర్మా ణానికి కృషి చేసిన గ్రామ సర్పంచ్‌ను ప్రశంసిం చారు.గత రెండున్నర సంవత్సరాల పాలనలో జగదాంబ తండా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనా నికి రూ.20 లక్షలు, మహిళా సంఘ భవనానికి రూ.10 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించడంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి నాలుగు బోర్లు మంజూరు చేసినట్లు వివరించారు.మహిళా సంఘాల సభ్యుల విజ్ఞప్తి మేరకు వారి అవసరాలను గుర్తించి రూ.10 లక్షలతో ప్రత్యేక భవనాన్ని నిర్మించామని పేర్కొన్నారు. ఈ భవనం మహిళా సంఘాల సమా వేశాలు, రికార్డుల భద్రతతో పాటు వివిధ కార్యక మాల నిర్వహణకు ఎంతగానో ఉపయోగపడుతుం దని అన్నారు.మహిళా సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తమ చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు గ్రామ మహిళలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పీఏసీఎస్ చైర్మన్, గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు తదిత రులు పాల్గొన్నారు.

యాసంగి సాగుపై వ్యవసాయ శాఖ అప్రమత్తం!

గోదావరిఖని, నవంబర్ 05 (సింగిడి):



వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న యాసంగి సీజన్‌లో సాగు విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేశారు. నీటి వనరులపై ఒత్తిడి తగ్గించడంతో పాటు పంట నష్టాలను నివారించేందుకు వరికి ప్రత్యామ్నా యంగా ఆరుతడి పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు.ఈ మేరకు గురువారం అంతర్గాం మండలంలోని సోమనపల్లి, పెద్దంపేట, రాయదండి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కాలువల కింద వరి సాగుకు బదులుగా శనగ, పెసర, మినుము, పొద్దుతిరు గుడు, కుసుమ, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. బోరుబావుల కింద కూడా నీటి లభ్యతను అంచనా వేసుకొని పరిమిత విస్తీర్ణంలోనే సాగు చేపట్టాలని తెలిపారు.అంతేకా కుండా మార్చి నెలాఖరులోగా పంట కోతలు పూర్తయ్యేలా స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసు కోవాలని, తద్వారా ఏప్రిల్, మే నెలల్లో ఉండే తీవ్రమైన ఎండల నుంచి పంటలను కాపాడుకోవ చ్చని వివరించారు. అకాల వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టాలు తగ్గించేందుకు కంకి నుంచి గింజలు రాలిపోని లక్షణాలున్న రకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో సాగు చేపడితే పెట్టుబడులు, నీటి వినియోగం తగ్గించుకోవడంతో పాటు రైతులకు నష్టభయం తగ్గుతుందని అధికారులు వివరించారు.ఈ కార్య క్రమంలో వ్యవసాయ అధికారి సతీష్, సర్పంచులు గుంట బాపు, ఆముల శ్రీనివాస్, సాధుల స్వప్న, ఉపసర్పంచులు, ఏఈఓలు శరణ్య, యాస్మిన్, గ్రామ కార్యదర్శులు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించాలి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05: (సింగిడి)



జిల్లాలో హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి, వారికి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, సరైన చికిత్స అందించేందుకు ప్రతి ఏఎన్ఎం ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు.జిల్లాలోని ఏఎన్ఎంలందరికీ హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, నమోదు, పర్యవేక్షణ, చికిత్స తదుపరి వైద్య సేవలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ, గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ, రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలతో బాధపడుతున్న గర్భిణులను ముందుగానే గుర్తించాలని తెలిపారు. హైరిస్క్ గర్భిణులను సంబంధిత వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన పరీక్షలు, చికిత్సలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. గర్భిణులందరికీ నిర్ణీత సమయంలో ఏ ఎన్ సి పరీక్షలు నిర్వహించి, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగంపై అవగాహన కల్పిం చాలని పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాతా శిశు ఆరోగ్య కార్యక్రమ అధికారి డాక్టర్ నాగేందర్ బాబు హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, ప్రమాదకర పరిస్థితుల అంచనా, రిఫరల్ విధానం, చికిత్స నిరంతర పర్యవేక్షణపై ఏఎన్ఎంలకు శిక్షణ అందించారు. జిల్లా ఎన్‌సీడీ కార్యక్రమ అధికారి డాక్టర్ రామకృష్ణ, జిల్లా ఇమ్యునైజేషన్ కార్యక్రమ అధికారి డాక్టర్ సంపత్ సిబ్బంది పాల్గొన్నారు.



పైలాన్ కోసం దాడులా?

గోదావరిఖని, నవంబర్ 05 (సింగిడి):

పైలాన్ తొలగింపు వివాదంలో జేసీబీ డ్రైవర్‌పై దాడి చేయడం అమానుషమని రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి హరిప్ర సాద్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టీఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, వ్యాళ్ల హరీష్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పైలాన్‌పై పేర్ల కోసం పట్టుబట్టడం కంటే ప్రజల సమస్యలు, బాధిత కుటుంబాల సంక్షేమంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాజకీయ విభేదాలను రాజకీయంగానే పరిష్కరించుకోవాలని, కార్మికులపై దాడులకు దిగడం సరికాదన్నారు.మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ మాట్లాడుతూ.. పైలాన్ వివాదం వెనుక రాజకీయ ఆధిపత్య పోరు ఉందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ దృష్టిలో పడేందుకు కొందరు నాయకులు రాజకీయ మైలేజీ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజకీయ పోరాటాల్లో సామాన్య ప్రజలను, కార్మికులను ఇబ్బందు లకు గురిచేయవద్దని, నాయకులు తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు.ఈ సమావే శంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ అప్సర్, ఎండీ మోయిన్, బుగ్గ రాముడు గౌడ్, సాధు రమేష్, ఎండీ మహమ్మద్, జబ్బార్, యాసీన్, బల్వాన్ సింగ్, యాకూబ్, అంజత్, బైరి కిరణ్ గౌడ్, పాకాల నాగరాజు, ముస్తాక్, తౌఫిక్, శెట్టి మల్లేష్, సూరతార, కొమిరి రజిత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్ హెచ్ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05: (సింగిడి)

జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్ హెచ్ ఎం పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరవధిక సమ్మె 24వ రోజుకు చేరింది. ఉద్యోగులు శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తూ, తమ డిమాండ్ల పై తక్షణ నిర్ణయం కోసం ప్రభుత్వాన్ని కోరుతున్నారు.సమ్మె వేది కను సందర్శించిన కార్యకర్తలు, సంఘాల ప్రతి నిధులు ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు ఘన సంఘీ భావం ప్రకటించారు. ప్రజారోగ్య వ్య వస్థలో కీలక సేవలు అందిస్తున్న వారి సమస్య లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల డిమాండ్లుదీర్ఘకా లంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

ఎడిటోరియల్

Editorial

పర్యావరణ విధ్వంసానికి ఆజ్యం పోస్తున్న యుద్ధాలు!

(నేడు "యుద్ధం, సాయుధ సంక్షోభాల్లో పర్యావరణ విధ్వంసాలను నివారించే అంతర్జాతీయ దినోత్సవం" సందర్భంగా)

యుద్ధాలు, సాయుధ సంఘర్షణలు అంటే మారణహోమమే. గాయపడిన సైనికులు, పౌర సమాజ అభాగ్యుల హాహాకారాలే. యుద్ధాల్లో ఆస్తుల ధ్వంసం, మౌళిక వసతుల వినాశనం తప్పనిసరి అని మనకు తెలుసు. యుద్ధాలు లేదా సాయుధ సంఘర్షణలు జరిగినపుడు ప్రపంచ మానవాళికి తెలిసేది మరణించిన వారి సంఖ్య, గాయపడిన ఆసుపత్రుల పాలైన ధ్వనుల వివరాలు, కూలిన భవనాలు, దెబ్బతిన్న మౌళిక వసతులు మాత్రమే ప్రచారంలోకి వస్తాయి. నగరాలు నెల మట్టం అవుతాయి. ఈ అపార నష్టాలతో పాటు యుద్ధాల వల్ల పర్యావరణానికి అపార నష్టాలు జరగడం కొనసాగుతున్నాయి. యుద్ధాలు జరిగినపుడు జల, వాయు, నేల కాలుష్యాలు నమోదు అవుతాయి. వ్యవసాయం కుంటుబడుతూ, ఆ ప్రదేశాల్లో ఆహార అభద్రత పెరుగుతుంది. జీవనోపాధులు పలుచబడతాయి. ఆకలి కేకలు పెరుగుతాయి. వలసలతో పర్యావరణ క్షీణత పెరుగుతుంది. అడవులు తరిగిపోతాయి. వన్యప్రాణుల నష్టం జరుగుతుంది. సహజ వనరులు లేదా గనులు విచ్ఛిన్నం అవుతాయి. చమురు పరిశ్రమలు దెబ్బతింటాయి. కలప, వజ్రాలు, బంగారం, విలువైన ఖనిజాల సంబంధ కార్యకలాపాలు దెబ్బతింటాయి.

యుద్ధాలు, సాయుధ సంఘర్షణల్లో పర్యావరణ దోపిడీని నివారించే అంతర్జాతీయ దినోత్సవం:

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 బిలియన్లు, అనగా 20 శాతం జనాభా సంఘర్షణల విష వలయంలో చిక్కి విలవిల్లాడుతున్నారు. గత ఆరు దశాబ్దాల్లో జరిగిన 40 శాతం సంఘర్షణల్లో పర్యావరణం అపార నష్టాలను మూటకట్టుకొని, రేపటి తరం ఆరోగ్యకర జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్న విషయాలను గుర్తించిన ఐరాస జనరల్ అసెంబ్లీ 2001లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 06 నవంబర్ రోజున "యుద్ధాలు, సాయుధ సంఘర్షణల్లో పర్యావరణ దోపిడీని నివారించే అంతర్జాతీయ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఫర్ ప్రివెంటింగ్ ది ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ ది ఎన్విరాన్‌మెంట్ ఇన్ వార్ అండ్ ఆర్మ్డ్ కాన్‌ఫ్లిక్ట్)" పాటించడం ఆనవాయితీగా మారింది. యుద్ధాల సమయంలో పర్యావరణ వ్యవస్థల సహజత్వాలను కాపాడడం, సహజ వనరుల సుస్థిర నియంత్రణ చేయడం, శాంతి స్థాపన చర్యలు తీసుకోవడం, పర్యావరణ ఆరోగ్య సంరక్షణకు నిధులు కేటాయించడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరుగుతున్నది. ఈ మహత్తర బాధ్యతలను పౌర సమాజం, ప్రభుత్వాలు, సంస్థలు చేతులు కలిపి పర్యావరణ విధ్వంసం జరుగకుండా అడ్డుకోవాలి. శాంతి, భద్రత, సుస్థిరాభివృద్ధి, మానవాళి శ్రేయస్సును కాపాడడం, చట్టపరమైన రక్షణలు కల్పించడం, ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రపంచ స్థాయి సమన్వయం సాధించడం లాంటివి కొనసాగాలి. ప్రస్తుతం సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయిల్–గాజా, అమెరికా/ఇజ్రాయిల్–ఇరాన్ యుద్ధాలు ప్రపంచ మానవాళిని, పర్యావరణాన్ని అతలాకుతలం చేయడం చూస్తున్నాం.

యుద్ధాలు జరిగినపుడు బాంబుల మోతలు మోగుతాయి. భూమాత సహజత్వం కాలుషితం అవుతుంది. రసాయన, హెవీ మెటల్ ప్రమాదాలు మీద పడతాయి. అడవుల విధ్వంసం జరుగుతుంది. మట్టి నాణ్యత మంటగలుస్తుంది. నీటి ఎద్దడి వెంటపడుతుంది. పేళని ల్యాండ్ మైన్స్ సమస్యలు ఉత్పన్నం అవుతాయి. మందుగుండు సామాగ్రి మట్టిని కలుషితం చేస్తుంది. యుద్ధాలతో దీర్ఘకాలిక సమస్యలు మానవాళిని తరుముతాయి. యుద్ధానంతరం కాలుష్య నివారణ అత్యంత ఖరీదు అవుతుంది. జీవ వైవిధ్యం దెబ్బ తింటుంది. ప్రజారోగ్యం మంటగలుస్తుంది. పర్యావరణ క్షీణత రేపటి బతుకులకు భరోసా పలుచబడుతుంది. ఈ భయానక విషయాలను గుర్తించి పౌర సమాజం, ప్రభుత్వాలు తగు చర్యలను తీసుకుంటూ పర్యావరణాన్ని కాపాడే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. యుద్ధాలను అంతం చేయడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మానవ శ్రేయస్సు కేంద్రంగా మన ప్రతి అడుగు సన్మార్గం దిశగా పడాలి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ధనత్రయోదశితో దీపారాధనకు శ్రీకారం

దీపావళి పండగ సందర్భంగా వరుసగా ఐదు రోజులు పర్వదినాలుగా భావించ బడుతున్న క్రమంలో మొదటిదైన ధన త్రయోదశి ప్రాముఖ్యతను సంత రించుకున్నది. ఆది వైద్యుడైన ధన్వంతరి జయంతి కావడం చేత ధన్వంతరి త్రయోదశిగా భావిస్తారు. అందుకే వైద్యులు ఘనంగా పూజిస్తారు. మహావిష్ణువు వామనావతారం ధరించి, బలిచక్రవర్తిని పాతాళానికి అణగదొక్కిందీ ఈరోజేనని ప్రతీతి. అందుకే 'త్రివిక్రమ త్రయోదశి'గా పిలవడమూ పరిపాటి. ఈ రోజుకు ధన్వంతరీ త్రయోదశి, యమ త్రయోదశి, కుబేర త్రయోదశి, ఐశ్వర్య త్రయోదశి వంటి పేర్లూ ఉన్నాయి. 'అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. అకాల



మత్యుభయాలు లేకుండా, సిరి సంపదలతో విలసిల్లాలి' అనే శుభాకాంక్షలకు నేపథ్యమే ధన(త్రయోదశి పర్వదినం. సంపదలతో తుల తూగడానికి లక్ష్మీదేవినీ, సంపూర్ణ ఆరోగ్యంకోసం ధన్వంతరినీ, సుస్థిర ఆర్థిక వృద్ధికి కుబేరుణ్ణీ, అపమృత్యు బాధలు తొలగడానికి యమధర్మరాజును వివిధ రీతుల్లో ధన త్రయోదశినాడు పూజించడం సాంప్రదాయం.

గుజరాతీయులకు సంవత్స రాది. అమావేర్ జ్యోతిషీ త్రయోదశిగా పేర్కొంది. అనగా పదమూడవ తిథి, పాశ్చాత్యులు పదమూడవ సంఖ్య మంచిది కాదని భావిస్తుండగా, హిందువులు మాత్రం మంచి రోజుగా తలుస్తారు. ధన త్రయోదశిని గుజరాతీయులు "ధన్ తేరస్" అని పిలుస్తారు. పొరుగు వారైన మహారాష్ట్రులు ధన త్రయోదశిని గొప్పగా జరుపు కుంటారు. ఆంధ్రావనిలోనూ పవిత్రమైన దినంగా ఆచరిస్తారు. ఈరోజు తమ ఇళ్ళను శుభ్ర పరుస్తారు. అలికి, కడిగి, ఇళ్ళముందు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దుతారు. శుచిగా, శుభ్రంగా ఉంచితే లక్ష్మీదేవి తమ ఇంటికి రాగలదని విశ్వాసం. ఈనాటి నుండి దీపాలను వెలిగించడం ప్రారంభం అవుతుంది. ఈనాడు అభ్యంగన స్నానం చేసి, మంచి బట్టలు వేసుకుని, సుగంధ ద్రవ్యాలు రాసుకుని, ధన పూజ చేస్తారు. ఇంట్లో ఉన్న బంగారు, వెండి వస్తువులను పాలతో కడుగుతారు. శుభ్రంగా పూజా స్థలంలో ఉంచుతారు. షావుకార్లు వ్యాపారులు ఈదినం తమ సరుకుల నిలువ, రొక్కం నిలువ సరి చూసుకుని, లక్ష్మీ పూజ చేస్తారు.
గుజరాత్, మహారాష్ట్రలలో, మాళవదేశంలో పండగ ఆచరణ అనాదిగా ఉంది. దీపావళి నుండి కొత్త ఖాతాలు, లెక్కలు ప్రారంభిస్తారు. వర్షాలు చాలా వరకు వెనకపట్టు పడుతుండడంతో, ఇక్కడ వెల్లవేసి, అలంకరణలు చేస్తారు. యమలోకం లోని పితరులు కూడా ఈ పండగకు తమ పూర్వ గృహాలకు తిరిగి వస్తారని మాళవ దేశస్తుల విశ్వాసం. ధన త్రయోదశి నాడు సాయంకాలం తమ ఇళ్ళ ముందు దక్షిణ దిశగా దీపాలు ఉంచుతారు. వచ్చే పితృ దేవతలకు దీపాలు దారి చూపిస్తా యని నమ్మకం. ఇంటి యజమాని, తల్లిదండ్రులు ఉంటే దక్షిణ దిక్కుగా పెట్టరు. ఈనాడు ఇంటిలో ఒక్క దీపమైనా పెడతారు. వివిధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సహస్ర నామార్చ నలు, లక్ష్మీ సూక్త మూలమంత్ర సంపుటీకరణం శ్రీసూక్త పూజలు గావిస్తారు. ప్రత్యేక దీపాలంకరణ ఆరాధనలు నిర్వహిస్తారు. ఆయుర్వేద విజ్ఞానానికి ధన్వంతరి ఆరాధ్య దైవం. క్షీరసాగర మథనం సమ యంలో మహావిష్ణువు అంశావతారంగా అమృత కలశ హస్తుడై సమస్త జనావళికి రోగ నివారణ ద్వారా ఆరోగ్యాన్ని ప్రసాదించడానికి ధన్వంతరి ఆవిర్భవించిన దినాన్ని హిందువులు ధన త్రయోదశి అని పండుగ జరుపుకుంటారు. గృహాలలో, నదీ సాగర తీరాలలో, వైద్య శాలలలో తూర్పు దిక్కుగా కలశ స్థాపన చేసి, ధన్వంతరిని ఆవాహన గావించి, ధన్వంతరిని ధ్యానించాకనే యథాశక్తి షోడశోపచార సహిత పురుశసూక్త విధానంతో అర్చన జరిపి, మత్స్య పురాణాంతర శ్లోక పఠనం చేసి, గరుడ పురాణాంతర్గత ధన్వంతరి సార్థకత కథ పాఠాయణం చేసి, వైద్యులకు, పెద్దలకు తాంబూలాలు సమర్పించి, ఘృతయుక్త పెసర పులగం నివేదన చేసి, భుజించడం ఆచారం. అలాగే లక్ష్మీదేవి ధనప్రదాతగా ఆవిష్కారమైన రోజుగా, దన త్రయోదశినాడు బంగారు, వెండి ఆభరణాలు కొనుగోలు చేస్తారు. దీంతో ఏడాది పొడవునా తమకు ధనలక్ష్మీ కృపాకటాక్షాలు చేకూరుతాయని విశ్వసిస్తారు...

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

నడిచే విజ్ఞాన సర్వస్వం కపిలవాయి లింగమూర్తి

నేడు కవి కేసరి వర్ధంతి

కపిలవాయి లింగమూర్తి (మార్చి 31, 1928 నవంబర్ 6, 2018) పాలమూరు జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, సాహితీ పరిశోధకుడు. పద్య రచనతో ఆయన ప్రస్థానం ఆరంభమైనా కథా రచన, విమర్శ ప్రక్రియతో వెలుగులోకి వచ్చారు. జానపద సాహిత్యం, పాలమూరు జిల్లా లోని దేవాలయాల పై విస్తృత పరిశోధనలు చేశాడు. 70 కి పైగా పుస్తకాలు రచించాడు. ఈయనకు కవి కేసరి అనే బిరుదు ఉంది. తెలంగాణా రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు అందుకున్న తొలివ్యక్తి కపిలవాయి



లింగమూర్తి.
ఆయన అచ్చంపేట తాలుకా, బల్మూర్ మండలం, జినుకుంటలో మాణిక్యమ్మ, వెంకటాచలం దంపతులకు మార్చి 31, 1928కు సరియైన ప్రభవ నామ సంవత్సరం మాఘ శుద్ధ నవమి నాడు జన్మించారు. ఆయనకు రెండున్నరేళ్ళ వయసులో తండ్రి మృతి చెందడంతో మేనమామ పెద లక్ష్మయ్య దగ్గర పెరిగారు. పాఠశాల విద్యను ఉర్దూ మాధ్యమంలో పూర్తి చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్ పరీక్షలు రాసి తెలుగులో విశారద ప్రమాణ పత్రాన్ని సంపాదించారు. అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి ఎం.ఏ. (తెలుగు) పట్టా పొంది 1954లో నాగర్‌కర్నూల్ జాతీయోద్యమ పాఠశాలలో తెలుగు పండితునిగా చేరారు. ఆ తర్వాత 1972 లో పాలెం శ్రీవేంకటేశ్వర ప్రాచ్య డిగ్రీ కళాశాలలో ఉపన్యాసకుడుగా చేరి దశాబ్దం పాటు సేవలందించి 1983లో ఉద్యోగ విరమణ పొందారు. లింగమూర్తి నడిచే విజ్ఞాన సర్వస్వంగా పేరుపొందారు. పలుగ్రంథాలు, పరిశోధనలు రచించి సాహితీవేత్తగా పేరుపొందాడు. కపిలవాయికి తెలుగు విశ్వవిద్యాలయం 26.8.2014 న గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. 30.08.2014 రోజున విశ్వవిద్యాలయం 13వ స్నాత కోత్సవంలో చాన్స్‌లర్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను అందించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ పొందిన వ్యక్తిగా కపిలవాయికి ఈ ఘనత దక్కింది. 1954 నుంచి 1983లో పదవీ విరమణ పొందే వరకు నాగర్‌కర్నూల్ లోని జాతీయోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసి, అక్కడే స్థిరపడ్డారు. అనేక స్థలచరిత్రలు, దేవాలయాల కథలకు ఆయన ప్రాణంపోశారు. మొత్తం 70 రచనలు ముద్రితమయ్యాయి. 11రచనలు ద్విముద్రితాలు, 25 రచనలు ముద్రించాల్సి ఉంది.

సమైక్యరాష్ట్రంలో తెలంగాణ కవులు, సాహితీ వేత్తలకు అన్యాయం జరిగింది. జీవోలు తెలుగులో రావాలి. పాఠశాలల్లో తెలుగు బోధించాలి అని సూచనలు చేశారు.

ఆయన శతాధిక రచనలు చేశాడు.
కపిలవాయి లింగమూర్తి కావ్యాలు, గీతాలు, శతకాలు, వచన సాహిత్యం, స్థల చరిత్రలు, బాల సాహిత్యం మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియలలో రచనలు చేశారు. ఈ రచనలపై పలువురు విద్యార్థులు పరిశోధనలు చేస్తున్నారు. ఇప్పటికి వీరి రచనలపై వివిధ విశ్వ విద్యాలయాలలో ఆరు సిద్ధాంత గ్రంథాలు రూపొందినవి.

1992లో కవితా కళానిధి, పరిశోధనా పంచానన, 1996లో కవికేసరి, 2005లో వేదాంత విశారద,2010లో గురు శిరోమణి, 2012లో సాహిత్య స్వర్ణ సౌరభ కేసరి, సాహితీ విరాణ్మూర్తి తదితర బిరుదులు, సత్కారాలు పొందారు.

కపిలవాయి లింగమూర్తికి సాహిత్య రంగంలో చేసిన విశేషకృషికి గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అనేక సందర్భాలలో సన్మానాలు జరిగాయి. 1983లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వీరిని సన్మానించారు. తరువాత నారా చంద్రబాబు నాయుడు, వై. యస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్నకాలం లోనూ వారిచే సన్మానాలు పొందారు. తెలంగాణ రాష్ట్ర సమితి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయనను సన్మానించారు. నలుగురు ముఖ్యంత్రులచే సన్మానింపబడిన ఏకైక తెలుగు కవి, పరిశోధకులు కపిలవాయి లింగమూర్తి. ఇంకా తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభాపురస్కారం, బూర్గుల రామకృష్ణారావు ప్రతిభా పురస్కారం, బ్రౌన్ సాహిత్య పురస్కారం, నోరి నరసింహశాస్త్రి పురస్కారం, కందుకూరి రుద్రకవి పురస్కారం, పులికంటి సాహితీ పురస్కారం, బి. ఎన్. శాస్త్రి స్మారక పురస్కారం మొదలైన ఎన్నో సత్కారాలను పొందాడు.

వెన్నెల సాహిత్య అకాడమీ కపిలవాయి లింగమూర్తి జీవితం, సాహిత్య సృజన, పరిశోధనలపై కవితా కళానిధి కపిలవాయి లింగమూర్తి పేరుతో ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. దీనికి 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ రెండో డాక్యుమెంటరీ చిత్రంగా నంది అవార్డును ప్రకటించింది.

-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

కరువు కోరల్లో వ్యవసాయం..

పేదల ఆకలి తీర్చే నిత్యావసర సరుకులపై కేంద్రం కార్యాచరణ ఏది?

ప్రకృతి ప్రకోపిస్తే పంటలు ఎండిపోతాయి.. వర్షాలు ముఖం చాటేస్తే పొలాలు బీళ్లుగా మారతాయి. కానీ ప్రకృతి వైపరీత్యాల కంటే ప్రభుత్వాల నిర్లక్ష్యమే రైతులను ఎక్కువగా కుంగదీస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుంది? ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, పర్యావాభ పరిస్థితులు దేశ వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. పంటలు చేతికందక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, పాలకుల ప్రకటనలు మాత్రం కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు నష్టపోతున్నాడు.. వ్యవసాయం సంక్షోభంలో పడుతోంది.. పేద కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోంది. అయినా కేంద్రం నుంచి స్పష్టమైన కార్యాచరణ ఎక్కడ? రైతు కన్నీటికి విలువ లేదా? అన్న ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.
ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో అసాధారణ మార్పులు సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి రైతులను అప్రమత్తం చేయాలి. పంటల సాగు విధానంలో మార్పులు తీసుకురావాలి. నీటి వనరులను కాపాడాలి. ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందించాలి. కానీ ఇవన్నీ సమీక్షా సమావేశాలకే పరిమితమైతే క్షేత్రస్థాయిలో రైతుకు ఒరిగేదేమిటి? ముందస్తు ప్రణాళికలు కాగితాలపై కాకుండా పొలాల్లో అమలైనప్పుడే వాటికి సార్థకత ఉంటుంది.

రాష్ట్రాలు నివేదికలు పంపుతున్నాయి.. కేంద్రం నిర్ణయాలేవి?

తెలంగాణలో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించి రూ. 30 వేల కోట్ల ఆర్థిక సాయం కోరినట్లు నివేదికలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 388 మండలాలు కరువు ప్రభావాన్ని ఎదుర్కొంటున్నాయి. కర్ణాటకలో 57.93 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు రాష్ట్రప్రభుత్వం అంచనా వేసింది. నష్టం విలువ రూ. 62 వేల కోట్లకు పైగా ఉంటుందని పేర్కొంది. ఇవి ఆయా రాష్ట్రాలు వెల్లడించిన గణాంకాలు మాత్రమే. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన నష్టాలపై ఒకే విధమైన తుది కేంద్ర నివేదిక ప్రజల ముందుకు రావాల్సి ఉంది. అసలు కేంద్రం వద్ద ఎన్ని రాష్ట్రాల నివేదికలు ఉన్నాయి? వాటిలో ఎంతమేర నష్టాన్ని పరిశీలించారు? ఎన్ని రాష్ట్రాలకు ఆర్థిక సాయం మంజూరు చేశారు? కేంద్ర బృందాలు ఎప్పుడు క్షేత్రస్థాయికి వెళ్తాయి? పరిహారం రైతుల ఖాతాల్లో ఎప్పటికి జమవుతుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా కాలయాపన చేయడం బాధ్యతాయుత పాలన అనిపించుకోదు. రాష్ట్రాలు నిధులు కోరడం, కేంద్రం పరిశీలిస్తామని చెప్పడం, అధికారులు నివేదికలు తయారు చేయడం.. ఈ తంతు పూర్తయ్యేసరికి రైతు చేతిలో మిగిలేది అప్పులేనా? నష్టాన్ని అంచనా వేయడానికే నెలలు పడితే రైతు కుటుంబాలు ఎలా జీవించాలి?



పరిహారం పేరుతో పరిహాసం వద్దు!

రైతు ఎకరాకు పెట్టే పెట్టుబడి రోజురోజుకూ పెరుగుతోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు ఆకాశాన్నంటుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంట పూర్తిగా నష్టపోతే ఇచ్చే పరిమిత పరిహారం రైతును ఎలా ఆదుకుంటుంది? నష్టాన్ని అంచనా వేసే విధానం పారదర్శకంగా ఉండాలి. భూమి యజమానులకే కాకుండా కౌలు రైతులకు కూడా న్యాయం జరగాలి. పంటల బీమా పరిహారాన్ని నెలల తరబడి పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే చెల్లించాలి. వ్యవసాయ రుణాల వసూళ్లను వాయిదా వేయాలి. తదుపరి పంట సాగుకు పెట్టుబడి సాయం అందించాలి.
రైతు పంట నష్టపోయినప్పుడు అప్పులు మాత్రం తగ్గవు. బ్యాంకు రుణాలు, ప్రైవేటు అప్పులు, కుటుంబ అవసరాలు అతడిని వెంటాడుతూనే ఉంటాయి. ఈ పరిస్థితుల్లో పరిహారం అందించడంలో జాప్యం జరిగితే రైతు మరింత సంక్షోభంలోకి వెళ్తాడు. కాబట్టి కరువు మండలాల్లో ప్రత్యేక సహాయ కార్యక్రమాలు చేపట్టాలి. రైతును ఆదుకోవడం ప్రభుత్వాల దాతృత్వం కాదు.. అది వారి ప్రాథమిక బాధ్యత.

పేదల ఆకలి మీద కూడా నిర్లక్ష్యమేనా?

కరువు ప్రభావం పొలాలకే పరిమితం కాదు. పంటల దిగుబడులు తగ్గితే ఆహార ధాన్యాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. రైతు ఆదాయం పడిపోతుంది. కూలీలకు పనులు తగ్గుతాయి. చివరకు పేద, మధ్యతరగతి కుటుంబాల వంటగదిపై ధరల భారం పడుతుంది. ప్రస్తుతం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు బియ్యం, గోధుమలు ఉచితంగా అందుతున్నాయి. కానీ బియ్యం ఒక్కటే కుటుంబానికి సంపూర్ణ ఆహార భద్రత కల్పించదు. కందిపప్పు, శనగపప్పు, వంటనూనె, చక్కెర వంటి నిత్యావసర సరుకులను కూడా సబ్సిడీ ధరలకు అందించాల్సిన అవసరం ఉంది. కరువు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక రేషన్ పథకాన్ని అమలు చేయాలి. కేంద్రం వద్ద ఉన్న ఆహార ధాన్యాల నిల్వలను అవసరమైన ప్రాంతాలకు కేటాయించాలి. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారుల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేయాలి. ధరల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలి. పేదవాడి కంచంలో అన్నం ఉండేలా చూడటం ప్రభుత్వాల కనీస ధర్మం.

కేంద్రం ముందున్న ప్రణాళిక ఏమిటి?

కేంద్రం కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రకటించిన ప్రణాళికలు క్షేత్రస్థాయిలో అమలుకావాలి. నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, కాలువల మరమ్మతులు, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. తక్కువ నీటితో పండే పంటలకు ప్రోత్సాహం ఇవ్వాలి. విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి. పశువులకు పశుగ్రాసం, గ్రామాలకు తాగునీరు అందించాలి. ఉపాధి హామీ పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఆదాయం కల్పించాలి. అంతేకాకుండా రాష్ట్రాలవారీగా జరిగిన నష్టాల వివరాలను కేంద్రం బహిర్గతం చేయాలి. ఏ రాష్ట్రానికి ఎంత సాయం అవసరం? ఎంత మంజూరు చేశారు? ఎంత విడుదల చేశారు? ఇంకా ఎంత పెండింగ్‌లో ఉంది? అనే వివరాలను ప్రజలకు తెలియజేయాలి. సహాయ నిధుల విడుదలకు కాలపరిమితి విధించాలి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోతే నష్టపోయేది చివరకు సామాన్య ప్రజలే.

ప్రకటనలు కాదు.. ప్రజలకు భరోసా కావాలి!

కరువు అనేది ఏ ఒక్క పార్టీకి, ఏ ఒక్క రాష్ట్రానికి సంబంధించిన సమస్య కాదు. ఇది దేశ ఆహార భద్రతకు సంబంధించిన సంక్షోభం. ఇలాంటి సమయంలో రాజకీయ విభేదాలు, నిధుల విషయంలో వివక్ష, అధికారుల కాలయాపనకు తావుండకూడదు. కేంద్రం రాష్ట్రాలకు అండగా నిలవాలి. రాష్ట్రాలు రైతులకు నేరుగా సహాయం అందించాలి. ప్రకటించిన పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి.
ప్రకృతి వైపరీత్యాలను ఆపడం ప్రభుత్వాల చేతుల్లో ఉండకపోవచ్చు. కానీ వాటి ప్రభావంతో ప్రజలు ఆకలితో అలమటించకుండా చూడటం మాత్రం ప్రభుత్వాల చేతుల్లోనే ఉంది. రైతు పంట పండిస్తేనే దేశానికి అన్నం అందుతుంది. రైతు నష్టపోతే దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం పడుతుంది.
ప్రకటనలతో రైతు కడుపు నిండదు.. హామీలతో అప్పులు తీరవు.. సమీక్షలతో పంటలు పండవు. కేంద్రం ఇప్పటికైనా మేల్కొనాలి. రాష్ట్రాల నష్టాలపై సమగ్ర నివేదిక విడుదల చేయాలి. తక్షణమే నిధులు మంజూరు చేయాలి. రైతులకు న్యాయమైన పరిహారం అందించాలి. పేదలకు నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలి. రైతు కన్నీరు తుడవని పాలనకు ప్రజల సమస్యలు పరిష్కరించిన ఘనత ఎలా దక్కుతుంది? రైతుకు భరోసా.. పేదలకు ఆహార భద్రత.. ఇవి హామీలు కాదు, ప్రభుత్వాలు నెరవేర్చాల్సిన కనీస బాధ్యతలు!

వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
సామాజిక రాజకీయాలపై
విశ్లేషణ 9848559863





సరిహద్దుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05: (సింగిడి)

వీర్నపల్లి భూముల రీ సర్వే లో భాగంగా క్షేత్రస్థాయిలో సరిహద్దుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామ పరిధిలోని జవహర్ లాల్ తండాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ గురువారం రెవెన్యూ, అటవీ, సంబంధిత శాఖల అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలోని పట్టా, అటవీ భూముల సరిహద్దుల వివరాలు పకడ్బందీగా సేకరించి, పారదర్శకంగా నమోదు చేయాలని, ఆ వివరాల గురించి రైతులకు, పట్టాదారులకు తెలియజేసి అవగాహన కల్పించాలని సూచించారు. భూముల హద్దులు, సర్వే నంబర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ నారాయణ రెడ్డి, అటవీ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఎమ్మెల్యే

కామారెడ్డి లింగంపేట: నవంబర్ 05(సింగిడి)



కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అండగా ఉంటామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ స్పష్టం చేశారు. లింగంపేట మండలం ముస్తాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మాలకమ్మరి సిద్ధయ్యకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే మదన్ మోహన్ భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విజయానికి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తన గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన ప్రతి కార్యకర్త సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన సిద్ధయ్యకు అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం సంతోషకరమన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడంతో పాటు, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నూతన పీఏసీఎస్ చైర్మన్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పొదల్లో అప్పుడే పుట్టిన పసికందు

కామారెడ్డి: ప్రతినిధి నవంబర్ 05 (సింగిడి)





మానవత్వాన్ని ప్రశ్నార్థకం చేసే ఘటన కామారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. అప్పుడే జన్మించిన పసికందును చెట్ల పొదల్లో వదిలేసి వెళ్లిన ఘటన దొమకొండ మండలంలోని ఓ గ్రామ శివారులో కలకలం రేపింది. అయితే సమయానికి గొర్రెల కాపర్లు గుర్తించడంతో ఆ చిన్నారి ప్రాణాలకు ముప్పు తప్పింది.గ్రామ శివారులోని చెట్ల పొదల మధ్య నుంచి పసికందు ఏడుపు వినిపించడంతో అటుగా గొర్రెలు కాస్తున్న కాపర్లు అప్రమత్తమయ్యారు. వెంటనే శబ్దం వచ్చిన ప్రాంతానికి వెళ్లి చూడగా, అప్పుడే పుట్టిన శిశువు కనిపించింది. దీంతో వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పసికందును రక్షించారు. అనంతరం శిశువును వైద్య సంరక్షణ కోసం తరలించినట్లు సమాచారం.కన్నబిడ్డను కంటికి రెప్పలా కాపాడాల్సిన సమయంలో ఇలా చెట్ల పొదల్లో వదిలివేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు సమయస్ఫూర్తితో స్పందించి పోలీసులకు సమాచారం అందించిన గొర్రెల కాపర్లపై స్థానికులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.పసికందును ఎవరు వదిలివెళ్లారు? ఏ పరిస్థితుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది. శిశువు తల్లిదండ్రుల వివరాలు, ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ఢిల్లీ వరల్డ్ స్కూల్ సమీపంలో మందుబాబుల వీరంగం!

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 5 (సింగిడి):



వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఆదర్శనగర్ కాలనీ సమీపంలో మందు బాబుల ఆగడాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఢిల్లీ వరల్డ్ స్కూల్ ముందు ఉన్న వెంచర్ ప్రాంతాన్ని కొందరు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో అక్కడ మద్యం సేవిస్తూ వీరంగం సృష్టిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.మద్యం సేవించిన అనంతరం ఖాళీ సీసాలను పగలగొట్టి రోడ్లపై పడేయడం, రాళ్లను రహదారులపై చెల్లాచెదురుగా వదిలివెళ్లడం పరిపాటిగా మారిందని చెబుతున్నారు. అంతేకాకుండా ఆదర్శనగర్ కాలనీ నుంచి కొందరు యువకులు బైకులను అతివేగంగా నడుపుతూ రాకపోకలు సాగించడంతో పాటు గుంపులుగా గుమికూడడం కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఇదే ప్రాంతంలో సిగరెట్లు, గంజాయి సేవిస్తున్నారనే ప్రచారం కూడా స్థానికంగా కలకలం రేపుతోంది. అయితే ఈ ఆరోపణలపై పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉంది.

అన్నదాతల కష్టాలు తీరేదెప్పుడు?

కామారెడ్డి జిల్లాలో అన్నదాతలకు ధాన్యం విక్రయాల అవస్థలు
దళారుల బారిన పడుతున్న రైతులు..
కొనుగోళ్లలో జాప్యంతో కల్లాల్లోనే నిరీక్షణ..
అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు!

కామారెడ్డి/లింగంపేట్ నవంబర్ 05 (సింగిడి)



ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతుకు చివరకు ధాన్యం అమ్ముకోవడమే పెద్ద సవాలుగా మారుతోంది. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చాలన్న ఆశతో పంట చేతికొచ్చే వరకు ఎదురు చూసిన అన్నదాతకు కొనుగోలు కేంద్రాల వద్ద కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. కేంద్రాలు ప్రారంభిస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు ఎంత వేగంగా సాగుతున్నాయి. రైతులకు నిజంగా మద్దతు ధర అందుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మండలాల వారీగా రైతుల పరిస్థితిపై దృష్టి!

కామారెడ్డి, మాచారెడ్డి, రాజంపేట, దోమ కొండ, భిక్కనూరు, బీబీపేట, సదాశివనగర్, తాడ్వాయి, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి, నాగిరెడ్డిపేట, బాన్సువాడ, బిచ్కుంద, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్, పెద్దకొడప్‌గల్, నస్రుల్లాబాద్ తదితర మండలాల్లో వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా కొనసాగుతోంది. ముఖ్యంగా వరి సాగు చేసే ప్రాంతాల్లో పంట చేతికొచ్చిన తర్వాత ధాన్యం విక్రయాలే రైతులకు కీలకంగా మారుతున్నాయి.బాన్సువాడ ప్రాంతంలో వరి కోతలు ముందుగా ప్రారంభమయ్యే పరిస్థితి ఉండగా, మాచారెడ్డి, కామారెడ్డి పరిసర ప్రాంతాల్లోనూ కొనుగోలు కేంద్రాల పనితీరు రైతులకు కీలకంగా మారింది. జుక్కల్, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్ ప్రాంతాల్లో రైతులకు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండటంతో పాటు రవాణా, నిల్వ, తూకం వంటి సౌకర్యాలు సక్రమంగా ఉండాల్సిన అవసరం ఉంది.

కొనుగోళ్లు వేగవంతం కావాలి!

కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించడం ఒక ఎత్తయితే, రైతుల నుంచి ధాన్యం సేకరించడం మరో ఎత్తు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు, తూకం, ఆన్‌లైన్ నమోదు వంటి ప్రక్రియల కారణంగా ఎదురుచూడాల్సి వస్తే వారి కష్టాలు మరింత పెరుగుతాయి.కొన్ని సందర్భాల్లో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగితే రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించుకోవాల్సి వస్తుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

కల్లాల్లోనే ధాన్యం..

పంట కోసి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసిన తర్వాత కొనుగోలు కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తే రైతులకు అదనపు ఖర్చులు తప్పవు. అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉంది. కూలీల ఖర్చులు, రవాణా భారం, అప్పుల వడ్డీలు రైతులపై మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన తర్వాత కూడా చెల్లింపులు సకాలంలో జరగకపోతే తదుపరి సాగుకు పెట్టుబడి సమకూర్చుకోవడం కష్టమవుతోంది.

దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట వేయాలి!

రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని కొందరు ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితులు ఏర్పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ మద్దతు ధర, సన్నరకం ధాన్యానికి పరిగించే బోనస్ వంటి ప్రయోజనాలు అర్హులైన రైతులకు పూర్తిస్థాయిలో అందాలి.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, గోనె సంచులు, తూకం యంత్రాలు, తేమ పరీక్ష పరికరాలు, ధాన్యం నిల్వకు అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి.



అధికారుల పర్యవేక్షణే రైతులకు భరోసా!

జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు మండలాల వారీగా కొనుగోలు కేంద్రాలను నిరంతరం తనిఖీ చేయాలి. ఎన్ని కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఎన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఎంత ధాన్యం సేకరించారు. ఎంతమంది రైతులకు చెల్లింపులు జరిగాయి అనే వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.ముఖ్యంగా గాంధారి, లింగంపేట, నాగిరెడ్డిపేట, సదాశివనగర్, ఎల్లారెడ్డి వంటి మండలాల్లోని గ్రామీణ రైతులకు కొనుగోలు కేంద్రాల సేవలు అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. రైతు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి చేరిన తర్వాత దానిని సకాలంలో సేకరించి, నిబంధనల ప్రకారం తూకం వేసి, చెల్లింపులు వెంటనే జరిగేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

400 కిలోమీటర్ల బీఆర్ఎస్ సైకిల్ యాత్ర

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 05 (సింగిడి) :



మేడిగడ్డ నుండి కొండపోచమ్మ సాగర్ వరకు చేపట్టిన సుమారు 400 కిలోమీటర్ల సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి పెద్దపల్లికి చేరుకున్న బీఆర్ఎస్ బృందాన్ని పెద్దపల్లి మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ దాసరి మనోహర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. గురువారం తన స్వగృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యాత్ర బృంద సభ్యులు ఉప్పు రాజ్ కుమార్, కాశీపాక వాసు, సురేష్, లక్ష్మణ్‌లను శాలువాలు కప్పి, పూలమాలలతో అభినందించారు. దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ఆత్మగౌరవం, రైతుల సంక్షేమం, ప్రజా ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన ఈ సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఈ యాత్ర కాలేశ్వరం పై ఉన్నఅబద్దపు ప్రచారానికి నిజం తెలిసేలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ యాత్ర ప్రజా సమస్యలపై పోరాడే సంకల్పానికి, రైతుల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. యువ నాయకుడు దాసరి ప్రశాంత్ రెడ్డి పాల్గొని సైకిల్ యాత్ర బృందానికి అభినందనలు తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్ వెన్నం సుజాత రవీందర్, సుల్తానాబాద్ పట్టణ అధ్యక్షుడు గుణపతి, టీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కొయ్యడ సతీష్, నాయకులు సురేష్, పుదరి చంద్రశేఖర్, పెంచల శ్రీధర్, ముత్యాల రాజయ్య, గుర్రాల శ్రీను, గోపి, శ్రీనివాస్, నాగరాజు, మధు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 05, (సింగిడి):



జిల్లా కేంద్రం లో ఉన్న వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపల్లి చంద్రం అన్నారు.గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యా వసతులు, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కళాశాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధ్యాపకులతో చర్చించారు. కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కళాశాలకు అవసరమైన సౌకర్యాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన పూర్తి వివరాలను అధ్యాపకులు అందించాలని సూచించారు. వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి పనులు చేపట్టేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.సునీత లెక్చలేర్, మాజీ కౌన్సిలర్ బుచ్చిరెడ్డి. సిద్దిపేట జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు మంద పాండు, బాల్ నర్సు పాల్గొన్నారు.

బియ్యం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 5 (సింగిడి):



ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ ధరలకు అమ్మే వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్ స్పష్టం చేశారు.గురువారం పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో ఉన్న ‘శ్రీ సాయి సూపర్ మార్కెట్’, ‘ఏజీ మార్ట్’లలో జిల్లా పౌరసరఫరాల శాఖ లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించడంతో, శ్రీ సాయి సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారి తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన 26 కిలోల బ్యాగ్ రకాల వారీగా కిలో ధరలు (రూపాయల్లో) బీపీటీ రూ.66 (కిలో) ఆర్ఎన్ఆర్ రూ.74 (కిలో), హెచ్ఎంటీ రూ.79 (కిలో) ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రతి సూపర్ మార్కెట్ బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ఈ ధరల వివరాలను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా బోర్డులు లేదా ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించాలని ఆయన ఆదేశించారు. బియ్యం కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, కొనుగోలుదారులు కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం కొనుగోలు చేయాలని సూచించారు.



సంచార ముస్లింల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్, నవంబర్ 5(సింగిడి)

సంచార ముస్లింల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సంచార ముస్లిం తెగల సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.సంచార ముస్లింలకు ప్రత్యేక ఆర్థిక సంస్థ ఏర్పాటు చేయాలని, ఏటా రూ.వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఉపాధి కోల్పోయిన వారికి రాయితీ రుణాలు, నిరుద్యోగ భృతి అందించాలని కోరారు. ఇళ్లు లేని వారికి గృహ వసతి, ఆత్మగౌరవ భవనానికి స్థలం, నిధులు కేటాయించాలని, సంప్రదాయ వృత్తులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. 'తాఫా-ఏ-తాలీమ్' పథకాన్ని ప్రారంభించి, సంచార ముస్లింలను కేంద్ర ఇతర వెనుకబడిన తరగతుల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05 (సింగిడి)



వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ స మీప లో ఈరోజు సాయంత్రం శివ అనే వ్యక్తి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి రోడ్డుపై కుప్పకూలిపోయాడు. అదే సమయంలో విధి నిర్వహణలో భాగంగా అక్కడ ఉన్న కానిస్టేబుళ్లు సల్మాన్, షకీల్, పంతులు నాయక్, నరేందర్, సతీష్ కుమార్, రాజ్‌కుమార్ ఈ విషయాన్ని గమనించారు.వెంటనే స్పందించిన పోలీసులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బాధితుడి వద్దకు చేరుకుని మానవతా దృక్పథంతో ప్రథమ చికిత్స అందించారు. మానవత్వం చాటుకున్న పోలీసు సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.



వేములవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి ఎకరం స్థలం కేటాయింపు

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05 (సింగిడి)

వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం చైర్మన్ రొండి రాజు అధ్యక్షతన గురువారం మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, కార్యదర్శి సరోజన, పాలకవర్గ డైరెక్టర్లందరూ పాల్గొని పలు కీలక అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు మాట్లాడుతూ, తమ పాలకవర్గం ఏర్పడి రెండు సంవత్సరాల కాలం పూర్తవుతున్న సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు, వేములవాడ రూరల్ మండల నూతన తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు కోసం మార్కెట్ కమిటీ యార్డులో ఎకరం స్థలాన్ని కేటాయిస్తూ పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ సమక్షంలో ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందన్నారు. తమకు పదవి ఇచ్చి, మార్కెట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు ఈ సందర్భంగా చైర్మన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో మార్కెట్ కమిటీకి స్వంత స్థలం లేని విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి, కలెక్టర్ ద్వారా మరిపెల్లి గ్రామంలో 12 ఎకరాల విశాలమైన స్థలాన్ని కేటాయించేలా చొరవ తీసుకున్నారని కొనియాడారు. అంతేకాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో మరిపెల్లి మార్కెట్ అభివృద్ధికై రూ. 3 కోట్ల 94 లక్షల 40 వేల భారీ నిధులను మంజూరు చేయించారాని వెల్లడించారు.గత మూడేళ్ల పాలనా కాలంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నేతృత్వంలో నియోజకవర్గంలో అపూర్వమైన అభివృద్ధి పనులు జరిగాయని వివరించారు. రైతుల సంక్షేమం కోసం మరిపెల్లిలో రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 40 ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. దక్షిణకాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని గోశాల కొరకు కూడా మరిపెల్లిలోనే మరో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. వీటితో పాటు గత పదేళ్లుగా మూలకుపడ్డ మరిపెల్లి రిజర్వాయర్ పనులను పునరుద్ధరించి, ఇప్పటికే దాదాపు 75 శాతం పనులను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని చెప్పారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి కొరకు దాదాపు రూ. 250 కోట్లు మంజూరు చేయించి, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పనులు యుద్ధప్రాతిపదికన వేగవంతంగా సాగేలా చూస్తున్న ఘనత పూర్తిగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కే దక్కుతుందన్నారు. గత 30 ఏళ్ల కాలంలో కొందరి దొరల పాలన తండ్రీ కొడుకుల పరిపాలనలోనే నియోజకవర్గం సాగిందని, వారు చేయలేని అభివృద్ధిని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ మూడేళ్లలోనే చేసి చూపించారని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు. కింది స్థాయి నుంచి వచ్చిన బీసీ ముద్దుబిడ్డ అయిన ఎమ్మెల్యే వేములవాడను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.తమ రెండు సంవత్సరాల పాలనా కాలంలో ఇప్పటివరకు పది పాలకవర్గ సమావేశాలను విజయవంతంగా నిర్వహించుకున్నామని చైర్మన్ తెలిపారు. ఈ సమావేశాలు మరియు మార్కెట్ విధులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సాగేందుకు నిరంతరం సహకరించిన రైతులకు పూర్వపు సెక్రటరీలకు, ప్రస్తుత సెక్రటరీకి, మార్కెట్ సిబ్బందికి, టైపిస్టులకు మరియు సెక్యూరిటీ గార్డులందరికీ చైర్మన్ రొండి రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవార్ల బోనాలతో ఆధ్యాత్మిక శోభ..

గోదావరిఖని, నవంబర్ 05 (సింగిడి):



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఆకెనపల్లి గ్రామం అమ్మవార్ల నామస్మరణతో మార్మోగింది. గ్రామంలో శ్రీ పోచమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి అమ్మవార్ల బోనాల ఉత్సవాలు భక్తి ప్రపత్తులతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది.గ్రామ సర్పంచ్ గాదే స్రవంతి–సుధాకర్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఆలయాలను మామిడి తోరణాలు, పూలమాలలతో సుందరంగా అలంకరించారు. అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై ఎత్తుకుని మంగళవాయిద్యాలు, భక్తి గీతాల నడుమ ఊరేగింపుగా ఆలయాలకు చేరుకున్నారు. అనంతరం అమ్మవార్లకు బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. బొడ్రాయి ఎదురు కొలువు కార్యక్రమంలోనూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి ఉత్సాహాన్ని చాటుకున్నారు.అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. భక్తుల జయజయధ్వానాలు, మహిళల బోనాల సందడితో ఆకెనపల్లిలో ఎటుచూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ వేడుకల్లో సర్పంచ్ గాదే స్రవంతి–సుధాకర్ దంపతులు, ఉపసర్పంచ్ ఐలవేని అనసూర్య, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చలికాలానికి పర్యాటక శోభ..

ప్రకృతి అందాలతో కళకళలాడనున్న కామారెడ్డి –నిజామాబాద్ జిల్లాలు! పర్యాటకులకు ఆహ్వానం పలుకుతున్న చారిత్రక కట్టడాలు.. జలాశయాలు.. ఆధ్యాత్మిక క్షేత్రాలు



కామారెడ్డి ప్రతినిధి: నవంబర్ 05 (సింగిడి)

చలికాలం ప్రారంభం కాబోతోంది. వేసవి ఎండల తీవ్రత తగ్గి, ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనే ఈ సమయంలో పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. ముఖ్యంగా నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలు, జలాశయాలు, దేవాలయాలు సందర్శకులను ఆకర్షిస్తాయి. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాగా ఉన్న ప్రస్తుత కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో ఎన్నో ప్రత్యేకమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటిలో కామారెడ్డి జిల్లా పర్యాటక ప్రాధాన్యతను ప్రత్యేకంగా చెప్పుకోవచ్చు.కామారెడ్డి జిల్లాకు ప్రత్యేక ఆకర్షణలుకామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టు పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. మంజీరా నదిపై నిర్మించిన ఈ చారిత్రక ప్రాజెక్టు జలవనరుల పరంగానే కాకుండా ప్రకృతి అందాల పరంగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందింది. అలాగే నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు, ప్రశాంతమైన వాతావరణం, పచ్చని పరిసరాలతో సందర్శకులను ఆకట్టుకుంటుంది.దోమకొండ కోట చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. 18వ శతాబ్దానికి చెందిన ఈ కోటలో ఆనాటి నిర్మాణ శైలి, చరిత్రను ప్రతిబింబించే కట్టడాలు ప్రత్యేక ఆకర్షణ. లింగంపేటలోని జాక్సాని నాగన్న బావి, కౌలాస్ కోట, ఇసన్నపల్లిలోని కాలభైరవ స్వామి ఆలయం, చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర ఆలయం వంటి ప్రాంతాలు కూడా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.నిజామాబాద్ జిల్లాలో ప్రకృతి అందాల సందడినిజామాబాద్ జిల్లాలో అలీసాగర్, అశోక్‌సాగర్, మల్లారం అటవీ ప్రాంతం పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తాయి. అలీసాగర్‌లోని జలాశయం, ఉద్యానవనం, కొండల మధ్య ప్రకృతి అందాలు కుటుంబాలతో విహరించేందుకు అనువుగా ఉంటాయి. అశోక్‌సాగర్‌లోని రాక్ గార్డెన్, సరస్వతీ దేవి విగ్రహం, జలాశయ పరిసరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.మల్లారం అటవీ ప్రాంతం ప్రకృతి ప్రేమికులకు మరో ప్రత్యేక గమ్యస్థానం. పచ్చని చెట్లు, ప్రశాంతమైన వాతావరణం, అరుదైన శిలారూపాలు, వ్యూ పాయింట్ పర్యాటకులను ఆకట్టుకుంటాయి. దిచ్‌పల్లి ఖిల్లా రామాలయం కాకతీయుల శిల్పకళా వైభవాన్ని చాటుతోంది. నిజామాబాద్ ఖిల్లా, రఘునాథ ఆలయం కూడా చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలు.చలికాలంలో పర్యాటకానికి అనుకూల సమయంచలికాలంలో ఉదయం వేళల్లో పొగమంచు, చల్లని గాలులు, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణం పర్యాటకులకు కొత్త అనుభూతిని అందిస్తాయి. జలాశయాల పరిసరాలు, అటవీ ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు సందర్శించేందుకు ఈ కాలం అనుకూలంగా ఉంటుంది. అయితే తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం



ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాలిప్రకృతి సంపద, చారిత్రక వారసత్వం ఉన్నప్పటికీ కొన్ని పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, సూచిక బోర్డులు, పారిశుధ్య సదుపాయాలు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉంది. పర్యాటక శాఖ, సంబంధిత అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు చిన్న వ్యాపారులకు కూడా ఆదాయం లభిస్తుంది.మొత్తంగా రాబోయే చలికాలం కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల సందడి తీసుకురావాలని స్థానికులు ఆశిస్తున్నారు. ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, ఆధ్యాత్మిక ప్రదేశాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ ప్రాంతాలను పర్యాటక పటంలో మరింత ప్రముఖంగా నిలపాల్సిన అవసరం ఉంది.









రాజన్న ఆలయ అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 05: (సింగిడి)



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ వీటీఏడీఏ ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి కూలీల సంఖ్య పెంచాలని, పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు అభివృద్ధి పనులను పరిశీలిస్తూ.. వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి.. మున్సిపల్ అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేస్తున్న దళారులపై విచారణ జరపాలి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 5:(సింగిడి)



భవన నిర్మాణ కార్మికులను మోసం చేస్తూ, లేబర్ కార్డులు ఇప్పిస్తామనే పేరుతో కొందరు దళారులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు.ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని ఆరో వార్డులో భవన నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతంలో భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు దరఖాస్తు ఫారాలను భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మహామేస్త్రి మర్ల సాయిబాబు అందజేశారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో నిజంగా పనిచేస్తున్న ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు కలిగి ఉండాలని సూచించారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996 భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం ద్వారా కార్మికులకు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసే అవకాశం కల్పించారని తెలిపారు. ఈ పథకాల ఫలాలు నిజమైన కార్మికులకు మాత్రమే అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా 55 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడైన కార్మికుడికి నెలకు రూ.5 వేల పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుడు జీవించి ఉన్నంతకాలం లేబర్ కార్డు కొనసాగించే విధంగా నిబంధనలు రూపొందించాలని కోరారు. ప్రభుత్వ భవన నిర్మాణ పనులు చేపట్టినప్పుడు శిలాఫలకాలపై తాపీ మేస్త్రీల పేర్లను కూడా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా అర్హులైన కార్మికులకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షల సబ్సిడీ అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్మికుల కష్టాన్ని ఆసరాగా చేసుకొని లేబర్ కార్డుల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న దళారుల వ్యవహారంపై అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని, కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మహామేస్త్రి మర్ల సాయిబాబుతో పాటు నిజమైన భవన నిర్మాణ కార్మికులు ఆశయ, బాలయ్య, మైపాల్, మల్లేష్, అరవింద్, కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమగడ్డ నుంచే మరో పోరాటం

సిద్ధిపేట, నవంబర్ 5:(సింగిడి)



తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన సిద్ధిపేట ప్రాంతం మరోసారి సామాజిక తెలంగాణ ఉద్యమానికి సిద్ధమైందని తెలంగాణ రక్షణ సేన పార్టీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర అన్నారు. తెలంగాణ రక్షణసేన సిద్ధిపేట జిల్లా పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి ఈనెల 13న భూమిపూజ జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులతో కలిసి గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భౌగోళిక తెలంగాణ సాధన తర్వాత తెలంగాణలో అంతరాలు లేని రాష్ట్రం కోసం కల్వకుంట్ల కవిత నాయకత్వంలో టీఆర్ఎస్ పార్టీ విశేష కృషి చేస్తున్నదని చెప్పారు. ప్రతి జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాల నిర్మాణం చేపట్టామని వివరించారు. ఈ నెల 13న పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్వయంగా సిద్ధిపేట రంగధాంపల్లి చౌరస్తా సమీపంలో పార్టీ భవన నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి సిద్ధిపేట జిల్లా నలుమూలల నుంచి భారీగా జనం తరలి రానున్నారని రవిచంద్ర వెల్లడించారు. ఏర్పాట్ల ప్రారంభంఈ నెల 13న జరిగే తెలంగాణ రక్షణ సేన పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణ భూమిపూజ కోసం పట్టణ శివారులోని రంగధాంపల్లి చౌరస్తాలో భూమిని చదును చేయించారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 05 (సింగిడి):



ఖరీఫ్ 2026 సీజన్‌లో ధాన్యం సేకరణను వేగవంతం చేసి, సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో ప్రతిపాదించిన 311 ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన తాగునీరు, నీడ, కూర్చునే వసతులతో పాటు గన్నీ సంచులు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తూ సకాలంలో రశీదులు అందించి, చెల్లింపులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4.69 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. సన్న ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తుందని, దీనిపై గ్రామస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు దళారులు, ప్రైవేట్ వ్యాపారులను నమ్మి తక్కువ ధరకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వ కేంద్రాలలోనే మద్దతు ధర మరియు బోనస్ పొందాలని కోరారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తూకాలు, నాణ్యత పరిశీలనలో పారదర్శకత పాటించాలని, రవాణా ఆలస్యం కాకుండా మిల్లులకు తరలించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దీపావళి పండుగ స్పెషల్..

నేతి బొబ్బట్లు ఇలా నిముషాల్లోనే ...



ముందుగా, బొబ్బట్ల పైపిండిని తయారు చేసుకోవాలి. ఒక కప్పు గోధుమపిండి, ఒక కప్పు మైదా పిండిని తీసుకోండి. దీనికి కొద్దిగా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నెయ్యిని కలిపి, నెయ్యి పిండికి బాగా పట్టేలా కలపాలి.

గోధుమపిండితో మాత్రమే చేయాలనుకుంటే, రెండు టేబుల్ స్పూన్ల నెయ్యి వేసుకోవాలి. నీటిని కొద్దికొద్దిగా పోసుకుంటూ, పిండిని చపాతీ పిండిలా గట్టిగా కాకుండా, చేతికి అంటుకునే విధంగా గట్టిగా కలుపుకోవాలి.

పిండి అంటుకునే విధంగా ఉంటేనే బొబ్బట్లు మృదువుగా వస్తాయి. పిండి కలిపిన తర్వాత, ఇంకో టేబుల్ స్పూన్ నెయ్యి వేసి బాగా కలిసేలా మర్దించుకోవాలి. ఆ తర్వాత, పిండి ఆరిపోకుండా పైన ఒక టీస్పూన్ నెయ్యి పూసి, మూత పెట్టి కనీసం ఒక గంటపాటు నానబెట్టాలి. పిండి బాగా నానితే బొబ్బట్లు మంచి రుచిగా ఉంటాయి.

లోపల పెట్టే పూర్ణం కోసం, ఒక కప్పు పచ్చిశనగపప్పు తీసుకోండి. పప్పును ఒకటి, రెండు సార్లు శుభ్రంగా కడిగి, రెండు కప్పుల నీళ్లు పోసి గంటపాటు నానబెట్టాలి. నానబెట్టిన పప్పును ప్రెషర్ కుక్కర్‌లో మూడు విసిల్స్ వచ్చేవరకు మీడియం మంటపై ఉడికించాలి. కుక్కర్ ప్రెషర్ పూర్తిగా పోయిన తర్వాత, పప్పును జాలి గిన్నెలోకి తీసుకుని నీళ్లు వడకట్టండి. పప్పు పూర్తిగా వడారిన తర్వాత, మళ్లీ కుక్కర్‌లోకి వేసి మ్యాషర్‌తో లేదా పప్పుగుత్తితో మెత్తగా మ్యాష్ చేయాలి. మిక్సీలో కూడా గ్రైండ్ చేసుకోవచ్చు.

మెత్తగా మ్యాష్ చేసిన పప్పులో ఒక కప్పు తురిమిన బెల్లం వేసి బాగా కలపాలి. స్వీట్ ఎక్కువ కావాలంటే పావు కప్పు బెల్లం అదనంగా వేసుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని స్టవ్ పై పెట్టి, మీడియం మంటపై కలుపుకుంటూ ఉడికించాలి. వేడికి బెల్లం కరిగి మిశ్రమం పల్చబడుతుంది. ఇది మళ్ళీ దగ్గరపడే వరకు, అడుగు అంటకుండా నిరంతరం కలుపుతూ ఉండాలి. బెల్లం గడ్డలు ఉంటే మ్యాష్ చేస్తూ ఉడికించండి.

బొబ్బట్లను వత్తడానికి బట్టర్ పేపర్ లేదా ఆయిల్ ప్యాకెట్/మిల్క్ ప్యాకెట్‌ను ఉపయోగించవచ్చు. ఎంచుకున్న పేపర్‌కు కొద్దిగా నెయ్యి పూసి సిద్ధంగా ఉంచుకోవాలి. ఇప్పుడు నానబెట్టిన పిండి నుంచి చిన్న ముద్దను తీసుకుని, చేతితో కొంచెం మందంగా వత్తి, మధ్యలో పూర్ణం ఉండను పెట్టి అన్నివైపుల నుండి మూసేయాలి. అదనపు పిండిని తీసేసి, పూర్ణం బయటకు రాకుండా చూసుకోవాలి. పిండి మూసిన భాగాన్ని కిందకు ఉంచి, చేతికి నెయ్యి రాసుకుని, నెమ్మదిగా పల్చగా వత్తుకోవాలి. మధ్య మధ్యలో నెయ్యి రాసుకుంటూ వత్తితే ఈజీగా వస్తుంది.బొబ్బట్లను కాల్చడానికి, పెనాన్ని బాగా వేడి చేసి, మీడియం మంటపై ఉంచండి. బొబ్బట్టును పేపర్‌తో సహా పెనంపై వేసి, నెమ్మదిగా పేపర్‌ను తీసివేయాలి. ఒకవైపు కొద్దిగా కాలిన తర్వాత తిప్పి, రెండు వైపులా నెయ్యి వేసుకుంటూ బంగారు రంగు వచ్చేవరకు కాల్చాలి. మంటను మీడియంలో ఉంచడం వల్ల బొబ్బట్లు మాడిపోకుండా చక్కగా కాలుతాయి. ఈ విధంగా అన్ని బొబ్బట్లను కాల్చుకోవాలి.

కీళ్ల నొప్పులు, ఉబ్బసానికి

చెక్ పెట్టే సూపర్ ఫుడ్..

రోజూ ఇది తింటే నరాల్లో, ఎముకల్లో ఇనుమంత బలం!

మనం ఆరోగ్యవంతంగా ఉండేందుకు అనేక రకాల తృణధాన్యాలు, పోషకాలు ఎంతగానో తోడ్పడతాయి. అలాంటి వాటిలో మినుములు అత్యంత ముఖ్యమైనవి. మినుములను తరచుగా తీసుకోవడం వల్ల ఇనుమంత బలం వస్తుందనే నానుడి ప్రచారంలో ఉంది.

ఈ నానుడికి తగ్గట్టుగానే, మినుముల్లోని అపారమైన పోషకాలు శరీర రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతాయని, తద్వారా అనేక రకాల వ్యాధుల నుండి శరీరాన్ని రక్షిస్తాయని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మినుముల్లో ఎన్నో పోషకాలు..



మినుములలో రీరానికి కావలసిన అనేక ముఖ్యమైన పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ప్రోటీన్లు, ఫైబర్, కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, పొటాషియం, బి-కాంప్లెక్స్, విటమిన్-సి, మంచి కొవ్వులు ఎక్కువగా ఉంటాయి.. ఇవి నాడీ వ్యవస్థను, జీవక్రియను సక్రమంగా ఉంచుతాయి.

మినుముల ప్రయోజనాలు..

మినుములను నిత్యం ఆహార పదార్థాల్లో భాగంగా చేసుకుంటే జీర్ణక్రియ ప్రక్రియ మెరుగుపడుతుంది. మినుముల్లో ఫైబర్ చాలా అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడేవారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. మలబద్ధకం, ఉబ్బసం వంటి సమస్యల నివారణకు కూడా మినుములు సహాయపడతాయి.

మధుమేహం, రక్తహీనత వంటి సమస్యలకు మినుములు అద్భుతమైన పరిష్కారం. వీటిలోని పోషకాలు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తాయి, ఇన్సులిన్, గ్లూకోస్ స్థాయిలను నియంత్రించడం ద్వారా మధుమేహ సమస్య తలెత్తకుండా రక్షిస్తాయి. అంతేకాకుండా, ఇవి రక్తహీనతను కూడా సమర్థవంతంగా నివారిస్తాయి.

మినుముల్లో కాల్షియం, భాస్వరం, పొటాషియం, ఐరన్, మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి.

ఈ ఖనిజాలు ఎముకలను బలంగా, దృఢంగా ఉంచడానికి అత్యవసరం.

కాబట్టి, ఎముకలు విరిగిన వారు, కీళ్లవాతం, ఆర్థరైటిస్ వంటి కీళ్ల సమస్యలతో బాధపడుతున్న వారు తమ ఆహారంలో మినుములను చేర్చుకోవడం వల్ల గణనీయమైన ప్రయోజనాలను పొందవచ్చు.అందుకే.. ఆహారంలో మినుములను భాగం చేసుకోవాలని.. తరచూ వీటితో చేసిన పదార్థాలను తినాలని డైటీషియన్లు సూచిస్తున్నారు. మినుములతో చేసిన ఆహారాలను బ్రేక్‌ఫాస్ట్ తోపాటు లంచ్ లో కూడా మంచిగా తీసుకోవచ్చు..అయితే.. ఏమైనా సందేహాలున్నా.. అనారోగ్య సమస్యలున్నా.. నేరుగా ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

పిల్లలకు అరటిపండు పెడితే

జలుబు చేస్తుందా?



ఏ సమయంలో ఇవ్వడం మంచిది? ఇప్పటికే జలుబు, దగ్గుతో బాధపడుతున్న పిల్లలకు అరటిపండు పెట్టాలా? వద్దా? వంటి విషయాలను ప్రతి తల్లిదండ్రులు తెలుసుకోవాలి.

అరటిపండులో ఉండే పోషకాలివే..

అరటిపండులో పిల్లల శారీరక ఎదుగుదలకు అవసరమైన ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇందులో పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ బి6, విటమిన్ సి, ఐరన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి పిల్లల ఎదుగుదలకు, శరీరానికి శక్తిని అందించడానికి తోడ్పడతాయి.

అరటిపండులో ఉండే కార్బోహైడ్రేట్లు పిల్లలకు తక్షణ శక్తిని అందిస్తాయి. పిల్లలు రోజంతా ఆడుకుంటూ, అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు. అలాంటప్పుడు శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో అరటిపండు ఉపయోగపడుతుంది. అలాగే ఇందులోని ఫైబర్ జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి సహాయపడుతుంది. మలబద్ధకం సమస్యను తగ్గించడంలోనూ తోడ్పడుతుంది.

చలికాలంలో పిల్లలకు అరటిపండు ఇవ్వవచ్చా?

చలికాలంలో అరటిపండు తినిపిస్తే పిల్లలకు జలుబు వస్తుందని చాలామంది తల్లిదండ్రులు భావిస్తుంటారు. అయితే అరటిపండు తినడం వల్ల నేరుగా జలుబు వస్తుందని చెప్పడానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. జలుబు సాధారణంగా వైరస్‌ల వల్ల వస్తుంది. పిల్లలకు ఇతర ఆరోగ్య సమస్యలు లేకపోతే చలికాలంలోనూ వారి ఆహారంలో అరటిపండును చేర్చవచ్చు.

అయితే పిల్లలకు ఇప్పటికే జలుబు, దగ్గు లేదా ఇతర అనారోగ్య సమస్యలు ఉంటే వారి పరిస్థితిని గమనించాలి. అరటిపండు తిన్నతర్వాత అసౌకర్యం కలుగుతుంటే వైద్యుల సలహా తీసుకోవాలి.

పిల్లలకు అరటిపండు ఎలా ఇవ్వాలి?

ఆరు నెలలు పూర్తయిన తర్వాత పిల్లలకు ఇతర ఘన ఆహారాలతో పాటు అరటిపండును కూడా పరిచయం చేయవచ్చు. చిన్నారుల వయస్సుకు తగినట్లుగా మెత్తగా గుజ్జు చేసి ఇవ్వాలి. పళ్లు రాని పిల్లలకు ప్యూరీ రూపంలో అందించవచ్చు. కొంచెం పెద్ద పిల్లలకు నేరుగా చిన్న ముక్కలుగా కోసి ఇవ్వవచ్చు.

చలికాలంలో అరటిపండు ఇచ్చేటప్పుడు ఫ్రిజ్‌లో పెట్టిన చల్లటి పండ్లకు బదులుగా సాధారణ ఉష్ణోగ్రతలో ఉన్న పండ్లను ఇవ్వడం మంచిది. పిల్లల వయస్సు, ఆకలి, జీర్ణశక్తిని బట్టి పరిమాణాన్ని నిర్ణయించాలి.

రాత్రిపూట అరటిపండు ఇవ్వకూడదా?

రాత్రిపూట అరటిపండు తినిపిస్తే జీర్ణ సమస్యలు, కఫం పెరుగుతాయని కొందరు భావిస్తుంటారు. అయితే రాత్రిపూట అరటిపండు తినడం వల్ల ప్రతి ఒక్కరికీ ఇలాంటి సమస్యలు వస్తాయని నిరూపించే ఆధారాలు లేవు. పిల్లలకు అరటిపండు ఇచ్చే సమయం కంటే వారి జీర్ణశక్తి, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం.

మొత్తానికి అరటిపండు పిల్లలకు మంచి పోషకాహారం. చలికాలం వచ్చిందని దానిని పూర్తిగా ఆపేయాల్సిన అవసరం లేదు. సరైన పరిమాణంలో, వయస్సుకు తగిన విధంగా అందిస్తే పిల్లల ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చు.

స్టాక్ మార్కెట్
Stock Market

ట్రంప్ ఓటమితో బంగారం ధరల్లో భారీ కుదుపు..

ఒక్కరోజే రూ.10 వేలు.. పండక్కి కష్టమే..

దీపావళికి ముందే బంగారం ధరలు ఒ భారీగా షాకిచ్చాయి. ధరలు ఊహించని రీతిలో పెరుగుదలను నమోదు చేశాయి. దీంతో ధంతేరస్, దీపావళికి పసిడి కొనుగోలు చేయాలనుకునేవారికి ఇది పెద్ద షాకింగ్ పరిణామంగా చెప్పవచ్చు.

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్‌పై తిరుగుబాటు జరగడంతో బంగారం, వెండి ధరల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిణామంతో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సోమవారం నుంచి గోల్డ్ రేట్లు బ్రేకుల్లేకుండా దూసుకెళ్తున్నాయి. రోజురోజుకి ధరలు పుంజుకుంటుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితి ఇలాగే ఉంటుందనే సంకేతాలు వినిపిస్తున్నాయి.

నవంబర్ 5వ తేదీన గురువారం బంగారం ధరలు ఏకంగా రూ. 3,220 ఎగబాకాయి. స్టాక్ మార్కెట్లు ప్రారంభం కాగానే పసిడి ధరల్లో భారీ ర్యాలీ దిశగా దూసుకెళ్లాయి. దీంతో ఈ పెరుగుదల తర్వాత హైదరాబాద్ బులియన్ మార్కెట్లో ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,46,020 వద్ద ఉండగా.. నేడు ఒక్కరోజే రూ. 3220 పెరిగింది. అటు 22 క్యారెట్ల ధర రూ. 1,33,850గా కొనసాగుతుండగా.. ఇవాళ ఒక్కరోజే రూ. 2950 పుంజుకుంది.

దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,46,170 వద్ద ట్రేడవుతుండగా.. 22 క్యారెట్ల రేటు రూ. 1,34,000గా కొనసాగుతున్నాయి. చెన్నై, బెంగళూరులో కూడా 24 క్యారెట్ల రేటు



రూ.. 1,46,020గా ఉండగా.. 22 క్యారెట్లు రూ. 1,33,850 పలుకుతున్నాయి. ఇక వెండి ధరలు అయితే ఏకంగా రూ. 10 వేలు పెరిగాయి. ఈ పెరుగుదల తర్వాత ఇవాళ హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో కిలో వెండి ధర రూ. 2,10,000 వద్ద కొనసాగుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీతో పాటు చెన్నై, బెంగళూరులోనూ ఇవే ధరలు పలుకుతున్నాయి. ట్రంప్ ఓటమితో డాలర్ విలువ భారీగా పతనమైంది. దీంతో తక్కువ యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్‌కు మద్దతు పెరగడంతో స్పాట్ గోల్డ్ 0.1 శాతం పెరిగింది. ప్రస్తుతం ఔన్సుకు 3,931.24 డాలర్లకు చేరుకుంది. ఈ ప్రభావం ధంతేరస్‌కు బంగారం కొనుగోలు చేసేవారి పై ప్రభావం చూపనుంది. దీంతో కొనుగోళ్లు స్థిరంగా ఉంటాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

ట్రంప్‌పై స్పష్టమైన వ్యతిరేకత..

ఊపందుకున్న స్టాక్ మార్కెట్లు.. ఈ షేర్లలో భారీ ర్యాలీ

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్లు ఘన విజయం సాధించారు. సెనేట్, ప్రతినిధుల సభ రెండింటినీ డెమొక్రాట్లు కైవసం చేసుకున్నారు. ట్రంప్ ప్రభుత్వంపై ఓటర్ల వ్యతిరేకతతో రిపబ్లికన్ల కంచుకోటల్లోనూ డెమొక్రాట్లకు విజయాలు సాధించారు.

ఎన్నికల ఫలితాలతో రాజకీయ అనిశ్చితి తగ్గిందన్న అంచనాలతో స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల జోరు కొనసాగింది. భారీ లాభాలతో వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్ ముగిసింది. ఎస్ అండ్ పీ 500 సూచీ 1.6 శాతం పెరిగి 7,688.62 పాయింట్లకు చేరింది. నాస్‌డాక్ కాంపోజిట్ 1.4 శాతం లాభపడి 25,736.51 పాయింట్ల వద్ద ముగిచింది. డౌజోన్స్ ఏకంగా 3 శాతం పెరిగి 53,356.12 పాయింట్లకు చేరింది.

ఏఐ దిగ్గజ కంపెనీల షేర్లలో భారీ లాభాలు కనిపించాయి. మైక్రోసాఫ్ట్ 6.7 శాతం, అమెజాన్ 6.1 శాతం, ఆల్ఫాబెట్ 3.2 శాతం, మెటా 1.4 శాతం పెరుగుదల నమోదు చేసింది. డేటా సెంటర్ల విస్తరణపై ఆంక్షలు రావచ్చన్న అంచనాలతో డేటా సెంటర్ కంపెనీల షేర్లు పతనమయ్యాయి. హుట్ 8 షేర్లు 23 శాతం, ఐరెన్ 11 శాతం, కోర్ సైంటిఫిక్ 10 శాతం, అప్లైడ్ డిజిటల్ 6.7 శాతం నష్టపోయింది. చిప్ తయారీ కంపెనీల షేర్లలోనూ ఒత్తిడి కొనసాగింది. ఫిలడెల్ఫియా సెమీకండక్టర్ సూచీ 3.1 శాతం పతనమైంది. డేటా సెంటర్ల నిర్మాణ వేగం తగ్గితే ఏఐ మౌలిక సదుపాయాల సరఫరాదారుల వ్యాపారంపై ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఇరాన్ యుద్ధం ముగింపుపై ఆశలతో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భారీగా తగ్గడం అమెరికా మార్కెట్లకు కలిసొచ్చిన పరిణామంగా చెప్పవచ్చు.క్లీన్ ఎనర్జీ రంగానికి డెమొక్రాట్ల మద్దతు కొనసాగుతుందన్న అంచనాలతో సోలార్ షేర్లలో ర్యాలీ కనిపించింది. ఇన్వెస్కో సోలార్ ఈటీఎఫ్ దాదాపు 6 శాతం లాభం పడగా.. ట్రంప్ ప్రతిపాదించిన 1.5 ట్రిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్‌కు కాంగ్రెస్‌లో అడ్డంకులు ఎదురుకావచ్చన్న అంచనాలతో రక్షణ రంగ షేర్లలో నష్టాలు చోటుచేసుకున్నాయి.

మధ్యంతర ఎన్నికల్లో ఓటమిపై డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో యుద్ధానికి దిగడమే తమ ఓటమికి కారణమైందని అంగీకరించారు. అయినా అవసరమైతే మళ్లీ యుద్ధానికి సిద్ధమైనని ప్రకటించారు. రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌ను పదవి నుంచి తొలగించే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. విధ్వంసకరంగా వ్యవహరించకపోతే డెమొక్రాట్లతో కలిసి పనిచేసేందుకు తాము సిద్ధమని తెలిపారు. కాగా అమెరికాలో ఎన్నికల కారణంతో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పతనమయ్యాయి. క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు కుప్పకూలాయి.



రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ సమస్యలు, భూ సంబంధిత అంశాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్ పనుల పరిష్కారానికి సంబంధించిన విషయాలపై చర్చించారు.

కాప్రా, నవంబర్ 5(సింగిడి): శామీర్‌పేట మండలం అంతాయిపల్లిలోని ఐడీఓసీ కలెక్టరేట్ భవనంలో బుధవారం రెవెన్యూ అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేయడంతో పాటు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు స్థానికంగానే డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలలో 6 ఇయర్స్ నుండి నడుస్తుంది అని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరితగతిన కేటాయించి, కళాశాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థలం కేటాయించాలని కోరుతూ మంత్రి శ్రీధర్ బాబును కోరిన ఎమ్మెల్యే



కాప్రా, నవంబర్ 5(సింగిడి): ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మంజూరు చేయాలని కోరుతూ బుధవారం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబును ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేయడంతో పాటు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు స్థానికంగానే డిగ్రీ విద్యను అభ్యసించే అవకాశం కల్పించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరమని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పాఠశాలలో 6 ఇయర్స్ నుండి నడుస్తుంది అని విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని త్వరితగతిన కేటాయించి, కళాశాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

నాగారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ఓటర్ నమోదు కార్యక్రమం



కీసర నవంబర్ 5(సింగిడి): ఘట్కేసర్ సర్కిల్, నాగారం జిహెచ్ఎంసి 5 డివిజన్ పరిధిలోని పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ ఓటర్ నమోదు కార్యక్రమం నాగారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తేల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బండారి శ్రీకాంత్ యాదవ్, నాగారం మాజీ కౌన్సిలర్ కౌకుంట్ల అనంత రెడ్డి, అన్నం రాజు శ్రీనివాస్, చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, అన్నం రాజు సంజీవ, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ విగ్నేష్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పులకుర్తి సంపత్ కుమార్, కొప్పుల మల్లేష్ తదితులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బోరువెల్స్ వేస్తే కఠినచర్యలు



వాహనాలు సీజ్: శంషాబాద్ డీసీ సుమన్ రావు హెచ్చరిక

రాజేంద్రనగర్, నవంబర్ 5(సింగిడి): ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 259 వాల్టా చట్ట నిబంధనల ప్రకారం,జీహెచ్ఎంసీ శంషాబాద్ సర్కిల్ పరిధిలో ముందస్తు అనుమతి లేకుండా ఎవరూ ఎలాంటి బోరువెల్స్ తవ్వించకూడదని శంషాబాద్ డెప్యూటీ కమిషనర్ సుమన్ రావు స్పష్టం చేశారు. శంషాబాద్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం బోరువెల్ ఆపరేటర్లు రిగ్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీ సుమన్ రావుతో పాటు డిప్యూటీ తహశీల్దార్ వాణి రెడ్డి, పాల్గొన్నారు. . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణపై అధికారుల హెచ్చరికలను స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి తప్పనిసరి: ఎవరైనా సరే, ఎవరికీ కూడా పర్మిషన్ లేకుండా బోర్ వేయడానికి వీల్లేదు.తాగునీటికైనా పర్మిషన్ కావాలి: తాగునీటి అవసరాల కోసం బోరువెల్ వేసుకోవాలనుకునే వారు కూడా ముందస్తుగా అధికారుల నుంచి అనుమతి తీసుకోవడం విధిగా పాటించాలి. చట్టపరమైన చర్యలు ఉ సీజ్: నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా అక్రమంగా బోర్లు వేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటువంటి వాహనాలను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు పెడతామని స్పష్టం చేశారు. బోరువెల్ ఆపరేటర్లు అందరూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని, ప్రజలందరూ భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, జిపిఓలు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో అర్హులైన పట్టభద్రులు పేర్లు నమోదు చేసుకోవాలి



కుత్బుల్లాపూర్, నవంబర్ 5(సింగిడి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి. వెంకటరామయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వారు వివరించారు.

జిల్లాలో ఇష్టారాజ్యంగా ఎర్రమట్టి తవ్వకాలు!

హద్దులు చెరుపుతున్న మైనింగ్ తవ్వకాలు

పైకప్పు లేకుండానే మట్టి తరలిస్తున్న లారీలు

లీజ్ పూర్తయ్యాక నిబంధనలకు తిలోదకాలు



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): వికారాబాద్ జిల్లా సహజ సంపద ఖిల్లా, భూతల్లి కడుపునిండా విలువైన ఖనిజ సంపద, ధరణి పై ప్రకృతి అల్లుకున్న అందాలు, వనములికల సముదాయాలు, మూసినది పుట్టినిల్లు, ఇక్కడి అనంతగిరి అడవి వెలువరించే గాలికి ఆనాడే కితాబు నిచ్చిన నిపుణులు, నాపరాతి గనులతో అంతర్జాతీయ వ్యాపారానికిక్షేత్రంగా నిలిచిన తాండూర్ పట్టణం, సిమెంట్ పరిశ్రమలతో విరాజీల్లుతూ ఉపాధిని అందిస్తున్న ఇంతటి ఔనత్యం ఉన్న వికారాబాద్ జిల్లాలో భూగర్భ ఖనిజ సంపద ల్యాటరెట్, సుద్ద నిక్షేపాలకు నిలఎమైనా జిల్లాలో ఇష్టారాజ్యంగా మైనింగ్ జరుగున్నదనే ఆరోపణలు నాటినుండి నేటి వరకు వినిపిస్తున్న విషయం జిల్లా ప్రజలకు, పాలకులకు, అధికారులకు, మైనింగ్ నిర్వాహకులకు తెలిసిన నిత్య సత్యం. ఇక్కడ ఎం చేసిన అడిగే దిక్కు మొక్కు ఉండదని, అధికారికంగా తవ్వకాలకోసం తీసుకునే అనుమతులు గోరంతగా ఉంటాయాని తవ్వకాలు కొండంతలుగా కొ అసాగుతున్నాయానేది జగమెరిగిన సత్యం. ప్రశ్నించే వారు అధికులు అక్రమ తవ్వకాలకు వత్తాసూ పలుకుతుంటే అధికారులు అక్రమ తవ్వకాలను నిలువరించడం సాధ్యం కాదని, సామాన్యులకు మైనింగ్ పై ఏలాంటి అవగాహన ఉండదని ఎవరైనా ప్రశ్నించే సాహసం చేసిన దాని పర్యావసానం వేరేలెవల్లో ఉంటుందని నిపుణులను అంటున్నారు. జిల్లా లో ఆయా మండలాల్లో కొనసాగుతున్న ఎర్ర మట్టి తవ్వకాలు, నవాబుపేట, మోమిన్ పేట తదితర మండలాల్లో కొనసాగుతున్నాయి. అదేవిధంగా సుద్ద తవ్వకాలు దారూర్, కోటపల్లి తదితర మండలాల్లో కొనసాగుతున్నాయి. అయితే తవ్వకాలు హద్దులు దాతుతున్నాయని, స్పష్టమైన నక్ష హద్దులు ఏర్పాటు చేయరని పలువురు పరిశీలకులు అంటున్నారు. ముందుగానే హద్దులు నిర్ణహించి తవ్వకాలకు అనుమతులు అంధించే అధికారులు తవ్వకాలపై పునఃపరిశీలన చేయడంపై ఆసక్తి చూపకపోవడం నిర్వాహకులు ఇష్టారాజ్యాంగం మైనింగ్ తవ్వకాలను జరపడం జిల్లాలో మామూళ్ళ విషయమేనని అంటున్నారు. దీంతో ఖనిజ సంపదను కొళ్లగొడుతున్న వారు కొనాళ్ళకు హాజమాహిషి చేసే స్థాయికి చేరుకోవడం ప్రశ్నించే వారిని నాయన, బాయానా మందలించడంతో వ్యాపారం సజావుగా సాగుతోందని పలువురు అంటూ అంటున్నారు. ఈ విషయం ఎర్రమటి, తవ్వకాల్లో, సుద్ద మట్టి తవ్వకాల్లో కొనసాగుతున్నదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఎర్రమట్టి, మొరం మట్టి అవసరం రోజు రోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో డిమాండ్ అదేస్థాయిలో ఉండటం కొందరికి కలిసి వచ్చే వ్యాపారంగా మారింది. సెలవు రోజులే అదునుగా ఎర్ర మట్టి, మొరం మట్టి తవ్వకాలు, తరలింపు లాభసాటి వ్యాపారంగా మారింది. ఈ వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరుకాయలుగా జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోంది. అంతే కాకుండా జిల్లాలోని తాండూర్ నియోజకవర్గం పరిధిలో ఇసుక తరలింపు సహితం మాఫియా ను తలపించే వ్యాపారమని కొందరు ఎంతకైనా తెగించే స్థాయిలో ఉన్నారని దాడులు ఇక్కడ నిత్యకృత్యని అంటున్నారు. ఈ వ్యాపారానికి అన్ని రకాల అండదండలు మెండుగా ఉండటమే ప్రధాన కారమని స్థానికులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మైనింగ్ వ్యాపారం దెడిప్యమాణంగా కొనసాగుతోంది. మీడియా కథనాలు వచ్చిన ప్రతిఘటన తప్పదని ఆందోళన వ్యక్తమవుతున్న తీరు జిల్లా లో ఉంది. మైనింగ్ లీజు నిబంధనలు పాటించకపోవడం ఇష్టారాజ్యాంగా అక్రమ తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆధాయానికి గండికోడుతున్న తీరుపై ప్రభుత్వం ప్రతిష్ఠా తృకాంగా తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని పరిశీలకులు కోరుతున్నారు. అయితే మైనింగ్ లీజ్ గడువు ముగిసిన తర్వాత లేదా లీజ్ రద్దయినప్పుడు, లీజ్ యజమాని భారత ప్రభుత్వ గనులు మరియు ఖనిజాల చట్టం మినరల్ కన్సెషన్ రూల్స్, మినరల్ కన్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్ రూల్స్ (ఎం సీ డి ఆర్) నిబంధనల ప్రకారం కొన్ని విధిగా పాటించాల్సిన నిబంధనలు ఉన్నాయి. మైనింగ్ లీజ్ పూర్తయిన తర్వాత యజమాని పాటించవలసిన ముఖ్యమైన నిబంధనలు ఈ విధంగా ఉన్నాయి. గనుల మూసివేత ప్రణాళిక అమలు ప్రగ్రెసివ్, ఫైనల్ మైన్ క్లోజర్ ప్లాన్ లీజ్ గడువు ముగిసే సమయానికి,ఆమోదించబడిన ఫైనల్ మైన్ క్లోజర్ ప్లాన్ ప్రకారం గనిని శాశ్వతంగా మూసివేసే ప్రక్రియను పూర్తి చేయాలి. భూమి పునరుద్ధరణ, మైనింగ్ చేసిన ప్రాంతాన్ని యథాస్థితికి తీసుకురావడం లేదా పర్యావరణానికి అనుకూలంగా మార్చడం చేయాలి. తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలు, ఖాళీ ప్రదేశాలను పూడ్చడం లేదా భద్రతా చర్యలు తీసుకోవడం, పర్యావరణ పరిరక్షణ మరియు హరిత హారం చెట్ల పెంపకం, మైనింగ్ లీజ్ ప్రాంతంలో, చుట్టుపక్కల అవసరమైన మేరకు మొక్కలు నాటి వాటిని సంరక్షించినట్లు నిరూపించాలి. కాలుష్య నివారణ కోసం వ్యర్థ పదార్థాల మట్టి కుప్పలు వర్షాలకు కొట్టుకుపోకుండా తగిన రక్షణ గోడలు, కాలువలు ఏర్పాటు చేయాలి. భద్రత మరియు ఫెన్సింగ్ చేయాలి. మైనింగ్ ప్రాంతంలో ప్రజలు, పశువులు ప్రమాదవశాత్తు పడిపోకుండా లేదా ప్రవేశించకుండా లోతైన గుంతల చుట్టూ పటిష్టమైన కంచెలు, లేదా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. ఒకవేళ భూగర్భ మైనింగ్ అయితే, షాఫ్ట్‌లు లేదా టన్నెల్స్‌ను శాశ్వతంగా, సురక్షితంగా సీలు చేయాలి.

ప్రభుత్వ బకాయిల చెల్లింపు ప్రభుత్వానికి చెల్లించవలసిన రాయల్టీ, డీయండ్ రాయల్టీ, జిల్లా ఖనిజ నిధి నేషనల్ మినరల్ ట్రస్ట్ బకాయిలు, ఇతర పన్నులన్నీ పూర్తిగా చెల్లించాలి. ప్రభుత్వ భూమిని వినియోగించుకున్నందుకు చెల్లించాల్సిన ఉపరితల అద్దె లేదా ఇతర ప్రభుత్వ చెల్లింపులు ఏవీ పెండింగ్‌లో ఉండకూడదు. యంత్రాలు మౌలిక సదుపాయాల తొలగింపు, పరికరాల తరలింపు, గనిలో ఏర్పాటు చేసిన యంత్రాలు, ప్లాంట్లు, షెడ్లు ఇతర చరస్తులను నిర్ణీత గడువులోగా తొలగించాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లీజ్ ఒప్పందంలో పేర్కొన్న షరతులకు లోబడి వీటిని ఖాళీ చేయాల్సి ఉంటుంది. రికార్డులు రిటర్న్స్ సమర్పణ, ఖనిజ నిల్వల వివరాలు, లీజ్ ముగిసేనాటికి గనిలో ఉన్న మిగిలిన ఖనిజ నిల్వలు, ఇప్పటివరకు తవ్విన ఖనిజానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన రికార్డులను ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్, రాష్ట్ర గనుల శాఖ అధికారులకు సమర్పించాలి. అధికారిక నిరభ్యంతర పత్రాలు ఎన్ వో సీ పొందడం రాష్ట్ర గనుల శాఖ, పర్యావరణ శాఖ ఇతర సంబంధిత అధికారుల నుండి క్లియరెన్స్ సర్టిఫికెట్లు లేదా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందాలి. అన్ని నిబంధనలు సక్రమంగా పాటిస్తేనే డిపాజిట్ చేసిన సెక్యూరిటీ డిపాజిట్ లేదా బ్యాంక్ గ్యారెంటీ ప్రభుత్వంచే విడుదల చేయబడుతుంది. ఈ స్థాయిలో నిబంధనలు ఉన్న లీజ్ ముగిసిన ప్రదేశాల్లో ఏ మేరకు నిబంధనలు పాటించారో తెలియాలంటే సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపడితే తెలుసుతోంది. అందుకు ఉన్నత అధికారులు చొరవచూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అమీన్‌పూర్‌లో యథేచ్ఛగా అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు!

అనుమతులు తక్కువ.. నిర్మాణాలు ఎక్కువ..

నిబంధనలకు విరుద్ధంగా భవనాల నిర్మాణం



అమీన్‌పూర్, నవంబర్ 5(సింగిడి): అమీన్పూర్ డివిజన్ పరిధిలో అక్రమ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణాలకు అనుమతులు పరిమిత అంతస్తులకే ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో మాత్రం అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

అనుమతుల పేరుతో అధికారుల సమర్థింపా?

అనుమతులకు మించి నిర్మాణాలు జరుగుతున్నా చర్యలు శూన్యం

భవన నిర్మాణ నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన అంతస్తులకే నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి నిర్మాణాలపై ప్రశ్నిస్తే అనుమతులు ఉన్నాయంటూ సంబంధిత అధికారులు సమర్థిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా ఎన్ని అంతస్తులకు అనుమతులు ఇచ్చారు? క్షేత్రస్థాయిలో ఎన్ని అంతస్తులు నిర్మిస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎప్పుడు? నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులే నిర్లక్ష్యం వహిస్తున్నారా?

నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేని నిర్మాణాలపై విచారణ జరిపి, నిబంధనలను ఉల్లంఘించిన భవన యజమానులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అమీన్పూర్ పరిధిలోని బహుళ అంతస్తుల భవన నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణ లో గల ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమములో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హోలీ, తహసిల్దార్,సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇసోజిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులకు మద్దతు ధర అందించడమే ప్రభుత్వ లక్ష్యం



సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఇసోజిపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు డీసీఎంఎస్ (ణజమీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ విజేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ తనిఖీలు

- రహదారుల విస్తరణ, చెరువుల అభివృద్ధిపై కీలక ఆదేశాలు



కుత్బుల్లాపూర్, నవంబర్ 5(సింగిడి): కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ గాజులరామారం సర్కిల్ 57 ల్లోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపారు. ట్రాఫిక్ సమస్యల నివారణ, చెరువుల పునరుద్ధరణ, ఎస్.టి.పి నీటి వినియోగంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. షాపూర్ జంక్షన్, డిసిపి కార్యాలయం సమీపంలోని పైప్‌లైన్ రోడ్ జంక్షన్‌లను జోనల్ కమిషనర్ పరిశీలించారు. ఈ రెండు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సజావుగా సాగేలా చూసేందుకు, 'ఫ్రీ లెఫ్ట్' పనులను తక్షణమే పూర్తిస్థాయిలో ప్రతిపాదించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి మహబూబ్ కుంట, సూరారం పెద్ద చెరువు వద్ద ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్ టి పి)ను (హెచ్ ఎం డబ్ల్యు ఎస్ ఉ ఎస్ బిట్స్) డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) తో కలిసి తనిఖీ చేశారు. ఎస్.టి.పి నీటి శుద్ధి సామర్థ్యాన్ని మరింత పెంచాలని ఆదేశించారు. శుద్ధి చేసిన నీటిని పార్కులు, రోడ్డు మధ్యలో ఉన్న సెంట్రల్ మీడియన్లలోని మొక్కలకు పోయడానికి నిర్మాణ రంగ పనుల కోసం గ్రీన్ ట్యాంకర్ల ద్వారా వినియోగించుకోవాలని సూచించారు. ట్యాంకర్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఎస్.టి.పి కి వెళ్లే రహదారిని వెంటనే అభివృద్ధి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఆ తరువాత శ్రీకృష్ణ నగర్ సమీపంలోని కొత్తకుంట చెరువును పరిశీలించిన జోనల్ కమిషనర్, దాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర చెరువు అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. మహబూబ్‌కుంట నుండి ఈ చెరువుకు వచ్చే ఇన్‌లెట్ (వరద నీటి కాలువ) ప్రవాహాన్ని మెరుగుపరిచేందుకు, ఇరిగేషన్ విభాగం ఇంజనీర్లతో సమన్వయం చేసుకుంటూ తక్షణమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ తనిఖీలో జోనల్ కమిషనర్ తో పాటు డిప్యూటీ కమిషనర్ వెంకట్రాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ ఈ)గోవర్ధన్, డిప్యూటీ ఈఈ (ఎస్ డబ్ల్యూ ఎం) నిఖిల్ రెడ్డి, ఏ సి పి సుమిత్ర, డిప్యూటీ ఈ ఈ (ఇంజనీరింగ్) మహదేవ్ అనురాగ్, డీజీఎం (ఎస్ టి) సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్వో, సబ్ రిజిస్టర్ సొంతభవనాలకు స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే వినతి



కాప్రా, నవంబర్ 5(సింగిడి): కాప్రా, ఉప్పల్ లో నూతన ఎంఆర్ఓ కార్యాలయాల నిర్మాణం, కాప్రాలో సబ్ రిజిస్టర్ కార్యాలయానికి సొంత భవనం, ఉప్పల్ భగాయత్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మించాలని కోరుతూ బుధవారం రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిసి వినతి పత్రం ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడమే లక్ష్యమని అన్నారు. కాప్రా, ఉప్పల్ ప్రాంతాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎంఆర్ఓ కార్యాలయాలు చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన పాత భవనాల్లో ఉండటంతో, వాటి స్థానంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన నూతన ఎంఆర్ఓ కార్యాలయ భవనాలను నిర్మించాలని కోరారు. కాప్రా ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్నందున ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల సౌకర్యార్థం కాప్రాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించి శాశ్వత కార్యాలయం ఏర్పాటు చేయాలని, ఉప్పల్ భగాయత్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపట్టాలని, ఇందుకోసం అవసరమైన స్థలాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేసిన విజ్ఞప్తులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి రేపటి లోగా ఎంఆర్ఓ ద్వారా స్థల పరిశీలన చేయిస్తామని హామీ ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వ కార్యాలయాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రజలకు పరిపాలనా సేవలను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఈ ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

క్రాకర్ షాపుల వద్ద భద్రత, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి

కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డి



కాప్రా, నవంబర్ 5(సింగిడి): దీపావళి పండుగను పురస్కరించుకొని క్రాకర్ షాపుల యజమానులు తగిన భద్రతా జాగ్రత్తలు పాటించాలని బుధవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో క్రాకర్స్ షాప్ నిర్వహికులతో సమావేశం ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుషాయిగూడ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎల్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి క్రాకర్ షాపు ముందు నీళ్లు, ఇసుక, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచుకో

ఎంఎం పహాడీలో ఘనంగా హజ్రత్ మీర్ మహమూద్ బాబా ఉర్సు ఉత్సవాలు



రాజేంద్రనగర్, నవంబర్ 5(సింగిడి): సులేమాన్ నగర్ డివిజన్ పరిధిలోని ఎంఎం పహాడీలో హజ్రత్ మీర్ మహమూద్ బాబా ఉర్సు ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన బాబా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరి జీవితాల్లో శాంతి, సుఖసౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. మతసామరస్యం, సోదరభావం, ఐక్యతను చాటిచెప్పే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో శాంతియుత వాతావరణాన్ని మరింత బలోపేతం చేస్తాయని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ అత్తాపూర్ రాజేంద్రనగర్ సర్కిల్ ఇన్చార్జి సుభాష్ రెడ్డి, సులేమాన్ నగర్ డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ జహీరుద్దీన్. - హైదర్‌గూడ అధ్యక్షులు చిన్న, బీఆర్ఎస్ నాయకులు నయీమ్, అబ్దుల్ రెహమాన్, షకీల్, అఖిల్, షేక్ బాబా, ఇబ్రహీం, నవాజ్, మహబూబ్, షానాజ్, సాదిక్, జంపన్న పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇ-శాంక్షన్, ఇ-హెచ్ఆర్ఎంఎస్, వామిస్ విధానాలపై అధికారులకు శిక్షణ





సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 5 (సింగిడి): తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక శాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల్లో డిజిటల్ పాలనను సమర్థవంతంగా అమలు చేయడంలో భాగంగా ఐఎఫ్ఎంఐఎస్ పరిధిలోని ఇ-శాంక్షన్, ఇ-హెచ్ఆర్ఎంఎస్ , వర్క్ అకౌంట్స్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ విధానాలపై అధికారులకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు జిల్లా స్థాయిలో దశలవారీగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు . ఇందులో భాగంగా నవంబర్ 4న జిల్లా స్థాయి అధికారులకు, నవంబర్ 5న మండల స్థాయి అధికారులకు, నవంబర్ 6న ఇతర డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు)కు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ తెలిపారు . ఈ కార్యక్రమానికి జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ) విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా విధానాల కార్యాచరణ, వినియోగం, అమలు తీరుపై అధికారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో డిజిటల్ పాలనను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అన్ని శాఖల అధికారులకు ఈ విధానాలపై ఏకరీతి అవగాహన కల్పించడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా డీటీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల్లో ఆర్థిక లావాదేవీలు, నిధుల మంజూరు ప్రక్రియలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ఇ-శాంక్షన్ విధానం ఉపయోగపడుతుందన్నారు . సంబంధిత అధికారులు ఈ విధానంపై పూర్తి అవగాహన పెంపొందించుకొని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్‌లైన్ ద్వారా నిధుల మంజూరు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. డిజిటల్ విధానాల అమలుతో పనుల్లో జాప్యాన్ని తగ్గించడంతో పాటు జవాబుదారీతనాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఇ-హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ఉద్యోగుల సేవా వివరాలు, సెలవులు, ఇతర ఉద్యోగ సంబంధిత అంశాలను ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు వీలుంటుందన్నారు. వామిస్ ద్వారా ప్రభుత్వ పనులకు సంబంధించిన ఆర్థిక వివరాలు, బిల్లులు, ఖాతాల నిర్వహణను డిజిటల్ విధానంలో చేపట్టవచ్చని వివరించారు. ప్రతి అధికారి ఈ విధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి, రోజువారీ కార్యాలయ కార్యకలాపాల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ల తో సంబంధిత అధికారులకు శిక్షణ ను అందించారు ఈ శిక్షణ కు జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది హాజరైయ్యారు .

చర్లపల్లి పారిశ్రామిక వాడలో... జిగేల్ మంటున్న క్రీడా వెలుగులు

7 కోట్లతో జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా 6 న ప్రారంభం





మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 5 (సింగిడి): తెలంగాణ రాష్ట్రంలోనే పేరెన్నిక గల పారిశ్రామిక వాడగా పేరుందిన చర్లపల్లి పారిశ్రామిక వాడలో మరో అదునాతన సౌకర్యాలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుంది. గత పాలకమండలి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ పేరున ఏర్పాటు చేసిన పార్కు పరిసర కాలనీల ప్రజలు కార్మికుల మన్ననలు అందుకున్న విషయం తెలిసిందే. దాదాపుగా ఆరున్నర ఎకరాలలో మిగిలిన స్థలంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఈనెల ఆరవ తేదీన అందుబాటులోకి రానుంది. క్రీడా మైదానం తోపాటు ఈఎస్ఐ డిస్పెన్సరీ కోసం నిర్మించిన నూతన భవనాన్ని కూడా జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు ఈనెల 6న ప్రారంభిస్తారని చర్లపల్లి నోటిఫైడ్ ఇండస్ట్రియల్ మున్సిపల్ ఏరియాస్ సర్వీసెస్ సొసైటీ(సినిమియాస్) ప్రతినిధులు వెల్లడించారు.

పారిశ్రామికవేత్తల సహకారమే ఇది.

దాదాపుగా ఏడు కోట్లతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఈఎస్ఐ డిస్పెన్సరీ భవనాన్ని పూర్తిగా పారిశ్రామికవేత్తల సహకారంతోనే నిర్మించాం. వారి యొక్క సూచనల మేరకు ఫైర్ స్టేషన్కు దగ్గరలోనే చర్లపల్లి పోలీస్ స్టేషన్ కోసం శాశ్వత భవనం నిర్మిస్తున్నాం టీఎస్ఐఐసీఐల నిధులతో పాటు దాతల సహకారం ఎమ్మెల్యే బిఎల్ఆర్ ప్రోత్సాహంతో పారిశ్రామిక వాడలో రోడ్లు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి సుందరంగా తీర్చి దిద్దుతాం (డాక్టర్ కే గోవిందరెడ్డి చైర్మన్, సినిమియాస్).

అత్యాధునిక ఆధునిక సౌకర్యాలు.

విశాలమైన ప్రాంగణంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో అదునాతన జింతో పాటు షటిల్ బ్యాట్మింటన్ కోర్టులు సమావేశ హాల్ నిర్మించాము. క్రికెట్ నెట్ ప్రాక్టీస్ క్రికెట్ కోర్టులు వేరువేరుగా ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో వాలీబాల్ టెన్నిస్ తదితర కోర్టులు కూడా ఏర్పాటు చేస్తాం. ప్రస్తుత పాలకమండలి హయాంలో పలు అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నాం. ఇటీవల నిరంతర నీటి సరఫరా నీటి ట్యాంకు సంపును అందుబాటులోకి తీసుకువచ్చాము. పారిశ్రామిక వాడలో పచ్చదనం పరిశుభ్రత పర్యావరణ కాలుష్య నివారణ పచ్చదనానికి ఎక్కువ కృషి చేస్తున్నాం.(తాటి శ్రీనివాస్ వైస్ చైర్మన్, సినిమియాస్).

అధికారి ఒక్కడే.. బాధ్యతలు నాలుగు!

అదనపు బాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి..

అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఆటంకాలు!

వనపర్తి మున్సిపాలిటీలో పాటు మూడు చోట్ల అదనపు బాధ్యతలు..

సిబ్బంది కొరతతో పాలనపై ప్రభావం

ఖాళీ పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యమెందుకు?

పనుల నాణ్యత పెరగాలంటే పర్మినెంట్ అధికారులు ఉండాల్సిందే!

వనపర్తి ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా ఉన్న అధికారులపైనే అదనపు బాధ్యతలు మోపుతూ పాలనను నెట్టుకొస్తున్న తీరు అభివృద్ధి పనులపై ప్రభావం చూపే ప్రమాదం కలిగిస్తోంది. ఒకవైపు సిబ్బంది కొరత.. మరోవైపు పెరుగుతున్న పనుల భారం.. ఇంకోవైపు పర్యవేక్షణ బాధ్యతలు.. వెరసి అధికారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి నెలకొంది. వనపర్తి మున్సిపాలిటీలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈ)గా విధులు నిర్వహిస్తున్న వినోద్ కుమార్‌కు పలు ప్రాంతాల్లో అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఈ పరిస్థితి చర్చనీయాంశంగా మారింది.

వినోద్ కుమార్ వనపర్తి మున్సిపాలిటీతో పాటు మహబూబ్‌నగర్‌లోని మూడా విభాగంలో డీఈగా, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కార్యాలయంలో డీఈగా, వనపర్తి లోని పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖలో డీఈగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ఒకే అధికారి పలు కార్యాలయాల బాధ్యతలు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

-నాలుగు చోట్ల బాధ్యతలు.. పర్యవేక్షణ ఎలా?

మున్సిపాలిటీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, నిర్మాణాల నాణ్యత పరిశీలన వంటి కీలక బాధ్యతలను ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. పనులు జరుగుతున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించడం, కాంట్రాక్టర్ల పనితీరును పరిశీలించడం,



బిల్లులు, అంచనాలు, సాంకేతిక అంశాలను తనిఖీ చేయడం వంటి విధులు ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఒకే అధికారి నాలుగు ప్రాంతాల బాధ్యతలు నిర్వహిస్తే అన్ని చోట్లా సమయానికి పర్యవేక్షణ సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

-ఖాళీ పోస్టులు భర్తీ చేయరా?

ప్రభుత్వం పట్టణాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆ పనులను పర్యవేక్షించాల్సిన కీలక ఇంజినీరింగ్ పోస్టులను భర్తీ చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు లేకపోవడంతో అదనపు బాధ్యతలు అప్పగించడం తాత్కాలిక ప్రత్యామ్నాయం కావొచ్చేమో కానీ, అదే శాశ్వత పరిష్కారంగా మారితే పాలనాపరమైన సమస్యలు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

-వనపర్తి పబ్లిక్ హెల్త్ కార్యాలయంలోనూ అధికారుల కొరత!

వనపర్తిలోని పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ సబ్ డివిజన్ కార్యాలయంలోనూ పూర్తిస్థాయి అధికారులు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. తాగునీటి సరఫరా, పైప్‌లైన్లు, నీటి శుద్ధి, ఇతర ఇంజినీరింగ్ పనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా అధికారులు ఉండాల్సిన అవసరం ఉంది. ఒకే అధికారిపై పలు బాధ్యతలు మోపడం వల్ల క్షేత్రస్థాయి పర్యవేక్షణకు తగిన సమయం కేటాయించగలరా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కార్యాలయంలో డిఈ పోస్ట్ ఖాళీగా ఉండడంతో వినోద్ కుమార్ కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. ముగ్గురు ఏఈ లు ఉండాలి కానీ ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఏఈ పోస్టులు రెండు శాంక్షన్ లో ఉన్న భర్తీ చేయలేదు. మహబూబ్ నగర్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ లో ఏఈగా పనిచేస్తున్న చంద్రశేఖర్ కు వనపర్తి పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఏఈగా, పెబ్బేరు మున్సిపాలిటీలో ఏఈగా ఆదనపు బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు శాంక్షన్ లో ఉన్న భర్తీ చేయలేదు. జూనియర్ అసిస్టెంట్ ను ఔట్సోర్సింగ్ లో తీసుకున్నారు

-బాధ్యతలు పెంచితే నాణ్యత పెరుగుతుందా?

ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. పనులు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ ఉంటేనే నాణ్యతా ప్రమాణాలు పాటించే అవకాశం ఉంటుంది. కానీ అధికారుల కొరతను భర్తీ చేయకుండా ఉన్న అధికారులకే అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ఆశించిన స్థాయిలో పర్యవేక్షణ జరుగుతుందా? అనే ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

-ప్రభుత్వం దృష్టి సారించాలి

మున్సిపల్ శాఖ, పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఖాళీగా ఉన్న డీఈ, ఏఈ తదితర కీలక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రతి కార్యాలయానికి పూర్తిస్థాయి అధికారులను నియమించి అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఆటంకాలు లేకుండా చూడాలి. అదనపు బాధ్యతల పేరుతో పాలనను తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం చేయకుండా శాశ్వత నియామకాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా ప్రజలు ప్రజలు కోరుతున్నారు.

పోలీసు కొలువులే లక్ష్యంగా.. అభ్యర్థులకు అధికారుల ప్రోత్సాహం





- 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్ పంపిణీ
- ఒత్తిడికి గురికాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్
- పట్టుదల, నిరంతర సాధనతోనే పోలీసు కొలువులు సాధ్యం: ఎస్పీ

కోదాడ, నవంబర్ 5(సింగిడి): పోలీసు ఉద్యోగాలే లక్ష్యంగా శిక్షణ పొందుతున్న యువతకు జిల్లా యంత్రాంగం ప్రోత్సాహం అందించింది. ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు 11 పుస్తకాలతో కూడిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె.నరసింహ బుధవారం పంపిణీ చేశారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కోదాడలోని కేఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో ఉచిత శిక్షణ పొందుతున్న 200 మంది అభ్యర్థులకు వీటిని అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జీవితంలో లక్ష్యం, గమ్యం స్పష్టంగా ఉండాలని సూచించారు. వాటిని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. చదవాల్సిన పాఠ్యాంశాలు, పరీక్షకు ఉన్న సమయాన్ని ముందుగానే అంచనా వేసుకుని చదువుకోవాలన్నారు. గత ప్రశ్నాపత్రాలను పరిశీలించి పరీక్షల సరళిని అర్థం చేసుకోవాలని సూచించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ కనీసం మూడుసార్లు పునశ్చరణ చేసుకోవాలని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, సూర్యాపేట, తుంగతుర్తి ఎమ్మెల్యేల సహకారంతో జిల్లా వ్యాప్తంగా 400 మంది అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. నైపుణ్యం కలిగిన అధ్యాపకులు, ఫిజికల్ ఈవెంట్స్‌లో అనుభవం ఉన్న పోలీసు సిబ్బందితో శిక్షణ ఇస్తున్నామని, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. యువత విలాసాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. నిరంతర కృషి, పట్టుదలతో సాధన చేస్తే అసాధ్యమంటూ ఏదీ ఉండదన్నారు. శిక్షణను ఒక యజ్ఞంలా భావించి పోలీసు ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1,400 మందికి పరీక్ష నిర్వహించి ప్రతిభ ఆధారంగా 400 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల అభ్యర్థులకు ప్రయాణ ఇబ్బందులు కలగకుండా కోదాడలోనే శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సైబర్ నేరాలపై అవగాహన

శిక్షణలో భాగంగా జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది అభ్యర్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, నకిలీ లింకులు, ఓటీపీ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల గురించి వివరించారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ సైబర్ సెక్యూరిటీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సంతోష్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఇన్‌స్పెక్టర్లు రామారావు, శివకుమార్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ఆర్ఎస్ఐలు సాయిరాం, సురేష్, అన్వర్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

కేఆర్ఆర్ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరు

104 మంది విద్యార్థులకు అవకాశం.. ఈనెల 7న ఎంపికలు



కోదాడ, నవంబర్ 5(సింగిడి): పట్టణంలోని కేఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు 2026--27 విద్యా సంవత్సరానికి ఎన్‌సీసీ యూనిట్ మంజూరైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ హరసారాణి తెలిపారు. బుధవారం ఒక ప్రకటనలో ఈ వివరాలు వెల్లడించారు. నల్గొండ 31(టి) బెటాలియన్ పరిధిలో ఈ యూనిట్ పనిచేస్తుందని పేర్కొన్నారు. మొత్తం 104 మంది విద్యార్థులకు అవకాశం ఉండగా, ఈ విద్యా సంవత్సరం మొదటి సంవత్సరం విద్యార్థుల్లో 34 మందిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇందులో విద్యార్థినులకు 33 శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు.ఎన్‌సీసీలో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈనెల 7న శనివారం ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో 1.2 కిలోమీటర్ల పరుగు పందెంతో పాటు ఇతర శారీరక దారుఢ్య పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. నల్గొండ బెటాలియన్ కమాండెంట్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ అధికారి టి.రాజు ఆధ్వర్యంలో ఎంపికలు జరుగుతాయన్నారు. బాలురకు 5 అడుగుల 6 అంగుళాలు, బాలికలకు 5 అడుగుల 3 అంగుళాల ఎత్తు ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు కళాశాలలోని ఎన్‌సీసీ కేర్‌టేకర్ అధికారి టి.రాజును సంప్రదించాలని సూచించారు.

కరువు ప్రభావిత రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపట్టాలి

- ఖరీఫ్--2026 కరువు సహాయక చర్యలపై ప్రత్యేక డీసీసీ సమావేశం



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 5(సింగిడి): జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాలను పునరుద్ధరించి, రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు అర్హులైన రైతుల పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ బ్యాంకు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్--2026 కరువు సహాయక చర్యల్లో భాగంగా ప్రత్యేక డీసీసీ/డీఎల్ఆర్ఎల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతుల వ్యవసాయ పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు. కరువు ప్రభావిత మండలాల్లోని అర్హులైన రైతుల పంట రుణాలను నిబంధనల ప్రకారం పునర్వ్యవస్థీకరించడం, రుణాల తిరిగి చెల్లింపు గడువును పొడిగించడం, తాత్కాలిక వాయిదా సదుపాయం) కల్పించే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఓ విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాలు, సంబంధిత బ్యాంకుల పాలక మండళ్లు ఆమోదించిన విధానాలకు అనుగుణంగా అర్హులైన రైతులకు సహాయక చర్యలు సకాలంలో అందేలా చూడాలని సూచించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణకు అవసరమైన రైతుల వివరాలను సక్రమంగా సేకరించి, భద్రపరిచి, నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ , ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2026 వరకు రెండు త్రైమాసికాల్లో జిల్లాలోని బ్యాంకులు మొత్తం 1,20,065 ఖాతాల ద్వారా రూ.2,520.18 కోట్ల పంట రుణాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మొత్తం 28 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించగా, వాటిలో 2 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత మండలాలుగా, 26 మండలాలు మోస్తరు కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించినట్లు వివరించారు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ మాత్రమే ఈ ప్రక్రియలో భాగమని, దీనిని రుణమాఫీ పథకంగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌బీఐ ఎల్‌డీఓ వి. ప్రదీప్ చంద్ర, నాబార్డ్ ఏజీఎం కృష్ణ తేజ, వ్యవసాయ శాఖ అదనపు డీఏ బి. శ్రీదేవి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొడుగు శ్రావణ్ కుమార్తె సారీ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



రాజేంద్రనగర్, నవంబర్ 5(సింగిడి): రాజేంద్రనగర్ పరిధిలోని నార్సింగి సర్కిల్ అల్కాపూర్ లో గొడుగు శ్రావణ్ కుమార్తె సారీ ఫంక్షన్ అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్ ముదిరాజ్, మణికొండ మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీ శ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు చిన్నారిని ఘనంగా ఆశీర్వదించి, జీవితంలో అన్ని రంగాలలో సంతోషంగా ఎదగాలని ఆకాంక్షించారు. వేడుకకు విచ్చేసిన అతిథులు కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతు మేళా నేపథ్యంలో పటిష్టమైన భద్రత బందోబస్తు చేపట్టాలి

- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో, ఐపీఎస్





కొడంగల్, నవంబర్ 5(సింగిడి): కొడంగల్ నియోజకవర్గంలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటన, బహిరంగ సభ, రైతు మేళా, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల నేపథ్యంలో పటిష్టమైన పోలీసు భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో, పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా బుధవారం కొడంగల్‌లోని కడ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాపింగ్, విధుల కేటాయింపు, పోలీసు సిబ్బంది మోహరింపు తదితర అంశాలపై ఎస్పీ గారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. పిపిటి ద్వారా సంబంధిత ప్రాంతాల మ్యాపింగ్‌ను ప్రదర్శిస్తూ, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, బహిరంగ సభా ప్రాంగణం, రైతు మేళా నిర్వహించే ప్రదేశం, వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, పార్కింగ్ స్థలాలు, ట్రాఫిక్ పాయింట్లు, బందోబస్తు విధులు నిర్వహించాల్సిన కీలక ప్రాంతాలను వివరించారు. ప్రతి పోలీసు అధికారి తమకు కేటాయించిన ప్రాంతం, విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, విధుల నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి, నిర్లక్ష్యానికి తావులేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ సభా ప్రాంగణం, రైతు మేళా పరిసర ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట్ల పోలీసు బలగాలను మోహరించాలని తెలిపారు. అనంతరం ఆమె క్షేత్రస్థాయిల

సెల్లార్లలో వ్యాపారాలు....రోడ్లపై వాహనాలు

నిబంధనలు పాటించని వ్యాపారులు

పట్టించుకోని అధికారులు



హన్మకొండ , నవంబర్ 5(సింగిడి): పార్కింగ్‌కోసం నిర్మించుకున్న సెల్లార్ స్థలాలను వ్యాపారులు వ్యాపార స్థలాలుగా ఉపయోగించుకుంటున్నారు. అదే షాపులకు వచ్చిన వినియోగదారులు వాహనాలకు పార్కింగ్ స్థలం లేక రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా వచ్చిపోయే వానాలతో పాటు ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ అంతరాయానికి కారకులైన వ్యాపారులు, అడ్డెభవనాల యజమానులపై ట్రాఫిక్ పోలీసులు కానీ, మున్సిపల్ అధికారులు కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయరాదన్న నిబంధనలను వ్యాపారులు విస్మరిస్తున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు,అటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంపై పలు అనుమానాలకు దారి తెస్తుంది. వీరి అండ దండలతోనే ఈ తతంగం నడుస్తుందనే విమర్శలు కూడా వినవస్తున్నాయి. ట్రాఫిక్ సమస్య వల్ల ఎప్పుడైనా జరగరాని సంఘటనలు జరిగితే తప్ప అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించిన పాపాన పోలేదు. సమస్యను పట్టించుకున్నట్లుగా చేస్తూ భవన యజమానులకు, వ్యాపారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నానే ఆరోపణలు కూడా జోరుగా వినిపిస్తున్నాయి. సెల్లార్లలో పార్కింగ్ చేయాల్సిన వాహనాలు రోడ్డుకు ఇరువైపుల నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. ఈ ట్రాఫిక్ సమస్య కాజీపేట నుండి వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వరకు నిత్యం కొనసాగుతూనే ఉంది. ప్రధానంగా హన్మకొండ బస్టాండ్, చౌరస్తా పరిసరాల తో పాటు కాకాజీ కాలనీ పరిసరాలలో వ్యాపార సముదాయాలతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల కోసం పెద్ద భవనాలు నిర్మించారు. వీటి లో చాలావరకు భవనాలు సెల్లార్లను కలిగి ఉ న్నాయి. ఎవరూ వీటిని పార్కింగ్ కోసం వినియోగించకుండా ల్యాబులు, ఆసుపత్రులకు సంబంధించిన సామాన్లకోసం వినియోగిస్తున్నారు. నిబంధనలు పాటించని భవన సముదాయాల యజమానులపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్ల పలు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు,మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ నివారణ చర్యలో భాగస్వాములు కావాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన ఎస్సై మధుకర్‌ను సన్మానించిన నేస్తం సేవా ట్రస్ట్



ములుగు ప్రతినిధి, నవంబర్ 5 (సింగిడి): మంగపేట మండల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై మధుకర్‌ను నేస్తం సేవా ట్రస్ట్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకొని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ మాట్లాడుతూ.. సమాజం పట్ల బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. నేస్తం సేవా ట్రస్ట్ చేపట్టే సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ట్రస్ట్ గతంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను తెలుసుకొని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి మరింత సేవ చేయాలని ట్రస్ట్ చైర్మన్ అమీర్‌ను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో నేస్తం సేవా ట్రస్ట్ ముఖ్య సలహాదారు జై భీమ్ రామ్మోహన్ పాల్గొన్నారు.

మంగపేట నూతన ఎస్‌హెచ్‌ఓకు అభినందనలు



ములుగు ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): మంగపేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా బాధ్యతలు చేపట్టిన మధుకర్‌ను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మధుకర్‌కు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.
ఈ సందర్భంగా చెట్టుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మంగపేట మండలంలోని అన్ని వర్గాల ప్రజలకు సమానంగా సేవలందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.
మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలని, ప్రజలు, పోలీస్ శాఖ మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చింతా పున్నారావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యోరి యానయ్య, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగేంద్రబాబు, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యురాలు పాయం అనిత, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేష్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు మురుకుట్ల నరేందర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొంకతి సాంబశివరావు, మాజీ జడ్పీటీసీ సిద్ధంశెట్టి వైకుంఠం, సింగిల్ విండో డైరెక్టర్ కొడం బాలకృష్ణ, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, కారుపోతుల నర్సయ్య, దామెర సారయ్య, ఏటూరునాగారం ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ, మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాసరావు, శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ యర్రంగారి సురేష్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యంపెల్లి వీరస్వామి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మైప లాలయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు హిదయతుల్లా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బసారీకారి హరికృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, మండల నాయకులు సయ్యద్ హుస్సేన్, చిన్నపెళ్లి రాంబాబు, పొట్రు సమ్మయ్య, కాటబోయిన నరసింహారావు, మహబూబ్ ఖాన్, తాతినేని హరికృష్ణ, ఎండీ పాషా, బొంబోతుల మురళి, చామకూరి కృష్ణ, లాజర్, మాటూరి పరమేష్, బట్ట రామారావు, కోరం లక్ష్మీపతి, ఆక సతీష్, గోమాసు లక్ష్మీనారాయణ, మేడిద సతీష్, ముక్కెర రాజు, మల్లెల కమలాకర్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మిర్యాలగూడ నవంబర్ 5(సింగిడి): గ్రామాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ దయమని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం జాలుబాయి తండా గ్రామపంచాయతీలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, గ్రామపంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ప్రజలకు మెరుగైన పాలన, ప్రభుత్వ సేవలు అందించేందుకు నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రైతులకు రుణ ఉపశమనం.. ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం

- కరువు ప్రభావిత రైతులకు 12 నెలల మారటోరియం..
- 36 నెలలకు రుణ చెల్లింపు గడువు పొడిగింపు
- చిన్న కాళేశ్వరం, తాడిచర్ల డేంజర్ జోన్ అంశాలపై కలెక్టర్ రాహుల్‌శర్మ సమీక్ష



జయశంకర్‌భూపాలపల్లి బ్యూరో, నవంబర్ 5(సింగిడి): జిల్లాలో కరువు పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు బ్యాంకుల ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పించాలని, మరోవైపు చిన్ని కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణతో పాటు తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఐడీఓసీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో ఈ మేరకు పలు కీలక సూచనలు చేశారు.
రైతులకు రుణాలపై ఊరట
జిల్లాలో కాటారం, మహాముత్తారం, మహదేవపూర్, మల్హర్‌రావు, కొత్తపల్లి గోరి మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించిందని కలెక్టర్ తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతుల పంట రుణాలను పునర్వ్యవస్థీకరించాలని బ్యాంకర్లకు సూచించారు. రైతులకు 12 నెలల మారటోరియం కల్పించడంతో పాటు రుణ చెల్లింపు కాలపరిమితిని మొత్తం 36 నెలల వరకు పొడిగించే వెసులుబాటు ఉందని వివరించారు. కరువు పరిస్థితుల్లో రుణాల వసూలు కోసం రైతులపై ఒత్తిడి తీసుకురావద్దని, దరఖాస్తులను సానుకూలంగా పరిశీలించి అర్హులకు రుణ సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. గత సీజన్‌లో లక్షా ఐదు వేల ఎకరాలకు పైగా వరి సాగు కాగా, ప్రస్తుత నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణాన్ని సుమారు 38 వేల ఎకరాలకే పరిమితం చేసేలా వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించిందన్నారు. రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు సాగు చేయాలని సూచించారు.
చిన్న కాళేశ్వరం భూసేకరణకు ప్రాధాన్యం
చిన్ని కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల వారీగా భూముల వివరాలు, అవార్డుల జారీ, మ్యుటేషన్లు, యాజమాన్య హక్కులు, టైటిల్ వివాదాలు, ప్రభుత్వ భూములకు సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ నుంచి రావాల్సిన మ్యుటేషన్ ప్రతిపాదనలను వెంటనే పంపించాలని, మూడు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భూసేకరణను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు.
తాడిచర్ల బాధిత కుటుంబాలకు న్యాయం
తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస ప్యాకేజీలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 2022కు ముందు గ్రామంలో నిర్మించిన ఇళ్లలో గ్రామపంచాయతీ లేదా పంచాయతీ కార్యదర్శి అనుమతులు పొందిన ఇళ్లను అర్హత ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. ఒకే వ్యక్తి పేరుపై ఒకటి కంటే ఎక్కువ ఇంటి నంబర్లు నమోదైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అసలైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. అందిన ఒరిజినల్ పిటిషన్లను పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆమోదించిన పిటిషన్లు, ఖచ్చితమైన ఇంటి నంబర్ల ఆధారంగా ఆర్ఎన్ఆర్ ప్రక్రియ చేపట్టాలన్నారు. గ్రామసభలను ముందస్తు షెడ్యూల్ ప్రకారం నిర్వహించి ప్రజలకు నోటీసులు జారీ చేయాలని, ఇళ్ల వివరాలను జియో కోఆర్డినేట్స్ ఆధారంగా ఫొటోలు, డిజిటల్ రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. భూసేకరణ, పునరావాస ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన కుటుంబాలకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఎల్డీఎం బి. నాగరాజు, ఆర్బీఐ, నాబార్డ్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జెన్‌కో సీఈ శ్రీప్రకాష్, రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు, మండలాల తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినోను ఎదుర్కొనే బాధ్యత అందరిదీ

- నీరు, విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 5(సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలందరిపై ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నకిరేకల్‌లోని శ్రీనివాస గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎల్‌నినో అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తాగునీరు, వ్యవసాయం, విద్యుత్తు, పశుసంపద, భూగర్భ జలాలు, ఉపాధి వంటి రంగాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. వర్షాల నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా వెంటనే కొనుగోలు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. భవిష్యత్తులో సన్నధాన్యం సాగును ప్రోత్సహించాలని, పశుగ్రాస కొరత రాకుండా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్, జనవరి నుంచి ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రం కావచ్చని, రైతులు యాసంగిలో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు అవసరమైతే అద్దె బోర్ల ద్వారా నీటి సరఫరా, ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా ఇంకుడు గుంతలు, ఊటకుంటలు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఎల్‌నినో పరిస్థితులపై ప్రజల సందేహాలు, సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో 18004251442 టోల్‌ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, ఆర్డీఓ అశోక్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జలసిరి బతుకమ్మ వీడియో సీడీని ఆవిష్కరించగా, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాటల ద్వారా ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన కల్పించారు.

జంతు జనన నియంత్రణకు అవసరమైన అన్ని సదుపాయాలు ఒకే చోట ఏర్పాటు చేయాలి

చెత్త వేరు చేసే ప్రక్రియను వేగవంతం చేసి, డంపింగ్ యార్డులో పటిష్టమైన నిర్వహణ వ్యవస్థను అమలు చేయాలి

అదనపు కలెక్టర్ ఖిమ్యా నాయక్ ఆదేశం



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 5 (సింగిడి): జిల్లా వ్యాప్తంగా జంతు జనన నియంత్రణ కార్యక్రమాలకు అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖిమ్యా నాయక్ ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ నాగవరం శివారులోని జంతు జనన నియంత్రణ కేంద్రం, డంపింగ్ యార్డును సందర్శించి అక్కడ జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. ముందుగా జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ వీధి కుక్కలకు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న విధానం, వాటికి అందిస్తున్న వైద్య సేవలు, కేంద్రంలో ఉన్న సదుపాయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జంతు జనన నియంత్రణ కార్యక్రమాలను సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జంతు జనన నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, వైద్య సదుపాయాలు, ఇతర వసతులను ఒకే చోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించిన అదనపు కలెక్టర్ అక్కడ చెత్తను వేరు చేస్తున్న విధానాన్ని, వ్యర్థాల నిర్వహణ తీరును పరిశీలించారు. చెత్త వేరు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను పద్ధతి ప్రకారం వేరు చేసి, వాటి నిర్వహణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. డంపింగ్ యార్డులో క్రమబద్ధమైన నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. డంపింగ్ యార్డులో జరిగిన అగ్నిప్రమాద ప్రాంతాన్ని కూడా అదనపు కలెక్టర్ పరిశీలించారు. భవిష్యత్తులో ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డంపింగ్ యార్డులో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, వ్యర్థాల నిల్వ, నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఏఈ ప్రశాంత్ గౌడ్, సానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కంపేట ప్రతిపాదిత అభివృద్ధికి రూ10 కోట్లు

- జడ్పీ, పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల సందర్శన
- గ్రామంలో పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్





హన్మకొండ, నవంబర్ 5(సింగిడి): తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ స్వగ్రామం అక్కంపేట ను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా ఆత్మకూర్ మండలం అక్కంపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు.తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ స్వగ్రామ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 10కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో ప్రతిపాదిత అభివృద్ధి పనులను స్థానిక సర్పంచ్ సాంబయ్య, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ, యాదవ కాలనీ, తదితర కాలనీలలో పర్యటించారు. గ్రామంలో ప్రతిపాదిత సిసి రోడ్లు, డ్రైనేజీలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించగా గ్రామ సర్పంచ్ సాంబయ్య, తదితరులు జిల్లా కలెక్టర్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. గ్రామంలోని కోదండ రామాలయం, రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వీబీజీ రాంజీ ద్వారా నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ గ్రామాన్ని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా వివిధ శాఖల ద్వారా అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో చేపట్టే ప్రతిపాదిత అభివృద్ధి పనులకు సంబంధించిన డీపీఆర్ లను త్వరగా అందజేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా నిర్వహించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలను సందర్శించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి ఆరా తీశారు. పాఠశాలలో మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారా లేదా అని ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పిఎంశ్రీ ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి ఎంతమంది విద్యార్థులు వస్తున్నారని ఆరా తీశారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. తాగునీటి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పాఠశాల దశ నుండే విద్యార్థుల జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుండే జీవితంలో సాధించాలనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకోవాలని తెలిపారు. పాఠశాల విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడి, మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల విజయాల గ్రాఫ్ పెరగడంతో పాటు అక్కంపేట గ్రామానికి ఉన్న చరిత్రను విద్యార్థులు నిలబెట్టాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రాంగణంలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి అన్నిరకాల కూరగాయలను పండించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ విజయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి యాదగిరి, పంచాయతీ రాజ్ ఏఈ బాబురావు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్ కుమార్, ఏఈఈ సుదర్శన్, ఏపీవో రాజిరెడ్డి, ఇతర శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్



మహాదేవపూర్ నవంబర్ 5(సింగిడి): శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. బుధవారం మహదేవపూర్ పోలీస్ స్టేషన్ ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను ఆయన పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ప్రతి ఒక్కరు బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం డిఎస్పి సూర్యనారాయణ, మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై సాంబమూర్తి తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 5(సింగిడి): భారతదేశానికి వచ్చే విదేశీ పౌరులకు వసతి కల్పించే హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, పీజీ వసతులు, హాస్టళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, హోమ్‌స్టేలు, ప్రైవేట్ ఇళ్ల యజమానులు తదితరులు ఇమ్మిగ్రేషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ శ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ సూచించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్, హైదరాబాద్ ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ ఆర్ ఆర్ ఓ) జారీ చేసిన పబ్లిక్ అడ్వైజరీ ప్రకారం విదేశీ పౌరుల రాకపోకలకు సంబంధించిన వివరాలను నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వసతి కల్పించే వారి చట్టబద్ధమైన బాధ్యత అని తెలిపారు. విదేశీ అతిథి వచ్చిన 24 గంటల్లోగా సంబంధిత వివరాలను నమోదు చేయాలని, నమోదు చేసిన రికార్డులను ఒక సంవత్సరం పాటు భద్రపరచాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. విదేశీ పౌరులకు వసతి కల్పించే వారు అధికారిక వెబ్‌సైట్ https://indianfrro.gov.in ద్వారా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలి. ముందుగా పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, అవసరమైన వివరాలు సమర్పించి, సంబంధిత కార్యాలయం నుంచి లాగిన్ వివరాలు పొందిన అనంతరం విదేశీ అతిథుల వివరాలను నిర్ణీత గడువులోగా నమోదు చేయాలి. వసతి ప్రదాతలు తమకు వర్తించే మాడ్యూల్, అవసరమైన పత్రాలు, సమర్పణ విధానం గురించి అధికారిక పోర్టల్‌లోని సూచనలను అనుసరించాలని తెలిపారు.

నరక

జనరల్ NEWS సింగిడి

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

రైతుల కష్టాలు తీర్చేందుకు నూతన పాలకవర్గం కృషి చేయాలి

బెజ్జంకి ఏఎంసీ నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి హితవు



బెజ్జంకి,నవంబర్ 5(సింగిడి): మండల రైతుల సంక్షేమం,వ్యవసాయ రంగ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన ఏఎంసీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్పర్సన్‌గా మాతంగి శిరీష అనిల్,వైస్ చైర్మన్‌గా పర్ష సంతోష్ కుమార్‌తో పాటు డైరెక్టర్లు జిల్లా రాజేశ్వరి,దేశరాజు అనిల్,నందికొండ తిరుపతిరెడ్డి, మైసంపల్లి తిరుపతి, ఇస్కిల్ల ఐలయ్య,జీల లింగం,రామకృష్ణారెడ్డి, మహమ్మద్ సాదిక్, కుంట హరికృష్ణ, ఎలకంటి శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి కృష్ణారావు,గుండా వెంకట్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్ వీరితో ప్రమాణం చేయించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.రైతుల పట్ల గౌరవభావంతో వ్యవహరిస్తూ వారు కష్టాల్లో ఉన్నప్పుడు తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోనే అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు పాలకవర్గ సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

కష్టపడిన కార్యకర్తలకు కాంగ్రెస్‌లో తప్పక గుర్తింపు

పదవికి తగిన బాధ్యతతో కష్టపడి పనిచేస్తే తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. 2014 నుంచి నేటి వరకు తన వెన్నంటి ఉండి గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తాను ఎప్పటికీ కృతజ్ఞుడిగా ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి,ప్రజలను పార్టీ వైపు నడిపించడానికి కార్యకర్తల కృషి ఎంతో ఉందని కొనియాడారు. గడపగడప కాంగ్రెస్ కార్యక్రమంలో మాతంగి అనిల్‌తో పాటు ఎంతోమంది కార్యకర్తలు తనతో కలిసి పనిచేశారని గుర్తుచేశారు.పార్టీ పరిస్థితులు క్లిష్టంగా ఉన్న సమయంలోనూ అనిల్ ఎంతో ధైర్యంగా తన వెన్నంటి నిలిచారని ప్రశంసించారు.పార్టీ కోసం ఆయన చేసిన కృషికి గుర్తింపుగానే ఆయన సతీమణి మాతంగి శిరీషకు ఏఎంసీ చైర్పర్సన్ పదవి దక్కిందని వివరించారు. కష్టపడిన కార్యకర్తలకు పదవులు కల్పించడం కాంగ్రెస్ పార్టీలో ఆనవాయితీగా వస్తోందన్నారు. పదవులను ఆశించడంలో తప్పులేదని అవకాశం రాని వారు నిరాశ చెందకుండా పార్టీ కోసం పనిచేస్తూ ముందుకు సాగాలని సూచించారు.నేడు కాకపోయినా ఏదో ఒక రోజు కష్టానికి తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని భరోసా ఇచ్చారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రైతులకు అందించిన ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అదే స్ఫూర్తితో రైతులకు మెరుగైన సేవలు అందిస్తున్నారని తెలిపారు.రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేయడంతో పాటు ఉచిత విద్యుత్, రుణాలు,ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని చెప్పారు. గత పాలకులు పదేళ్ల పాలనలో పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొనేందుకు బెజ్జంకి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కేడీసీసీ బ్యాంకు చౌరస్తా వద్ద నాయకులు, కార్యకర్తలు,నూతన పాలకవర్గ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ జనసమూహం మధ్య మార్కెట్ యార్డు వరకు ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎడ్లబండి చౌరస్తాలో గోమాత విగ్రహాలకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పులి కృష్ణ, మాజీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాసరెడ్డి,బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్,పీఏసీఎస్ చైర్మన్లు ఒగ్గు దామోదర్ (బెజ్జంకి), ఊట్కూరి వెంకటరమణ రెడ్డి (ఇల్లంతకుంట), మోరపెల్లి రమణారెడ్డి (నుస్తులాపూర్), ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి (ఊటూరు), మానకొండూరు ఏఎంసీ చైర్మన్ రేవెల్లి రాజలింగం,వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాసరెడ్డి, గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునీల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు ముస్కు ఉపేందర్ రెడ్డి, నందగిరి రవీంద్ర చారి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, అక్కరవేణి పోచయ్య ముదిరాజ్,పనుల వెంకటి,జువ్వాడి మన్మోహన్ రావు, కొమ్మెర రవీందర్ రెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, గూడెల్లి శ్రీకాంత్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, శానగొండ శ్రావణ్,జెల్ల ప్రభాకర్,చింతల శ్రీధర్ రెడ్డి,ఉదయ్ రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, కట్కం తిరుపతి,బండి మల్లేశం,గోపు మల్లారెడ్డి,మామిడి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పైతర గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి



కొల్చారం, నవంబర్ 5(సింగిడి): కొల్చారం మండలంలోని పైతర గ్రామంలో కేక్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎల్ నీ నో ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని ఏఈఓ సూచించారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి నేలను కాపాడుకోవాలని, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ , ఏఈఓ అమృత, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

శాంక్షన్ అయిన పనులను ప్రారంభించి, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి

కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్లు



కాప్రా, నవంబర్ 5(సింగిడి): రూ. 73 లక్షలతో కుషాయిగూడ డీమార్ట్ నుండి సాయి నగర్ కాలనీ వరకు స్టార్మ్ వాటర్ డ్రైన్ పని ఎమర్జెన్సీ పనిగా శాంక్షన్ చేయాలని, రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, శ్రీ కృష్ణ నగర్ లలో రూ. 1 కోటి 26 లక్షలతో స్టార్మ్ వాటర్ డ్రైన్ పని గురించి అడగగా, త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపాలని, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ గా ఉన్నప్పుడు శాంక్షన్ అయిన మారుతి ఎన్‌క్లేవ్ పార్క్ కు రూ. 2 కోట్ల 30 లక్షలు పనుల గురించి బుధవారం జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఐఏఎస్ ని కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్ లు బొంతు శ్రీదేవి యాదవ్, పావని రెడ్డి, స్వర్ణ రాజ్ శివమణి లు మర్యాదపూర్వంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్ట్రీట్ లైట్ల సమస్య గురించి, పాడైన స్ట్రీట్ లైట్లను వెంటనే రిపేర్ చేయాలని, కొత్త స్ట్రీట్ లైట్లు కూడా కావాలని, దోమల నివారణ కోసం కొత్తగా తీసుకొచ్చిన దోమల మందు స్ప్రే మెషిన్ (ఫాగింగ్ మెషిన్) చాలా బాగా పని చేస్తుందని అభినందించారు. అన్ని కాలనీలలో క్రమం తప్పకుండా తిప్పాలని, శానిటేషన్ సిబ్బంది కొరత గురించి చాలా సార్లు చర్చించామని, సిబ్బందిని పెంచాలని కోరారు. మంత్రి శ్రీధర్ బాబు గారిని కలిసిన విషయాన్ని జోనల్ కమిషనర్ కి తెలియజేస్తూ... త్వరలోనే శంకుస్థాపన పనులను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని కోరారు. శాంక్షన్ అయిన పనులను త్వరగా ప్రారంభించాలని, పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. అనంతరం చర్చించిన ఈ అంశాలపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

కొమురవెల్లి ఠాణాను తనిఖీ చేసిన ఏసీపీ సదానందం

వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ పరిశీలన

ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలని సూచన

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం





కొమురవెల్లి నవంబర్ 5(సింగిడి): హుస్నాబాద్ ఏసీపీ సదానందం బుధవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణను, వివిధ విభాగాలను పరిశీలించి సిబ్బంది పనితీరు, రికార్డులు, కేసు ప్రాపర్టీలు మరియు స్టేషన్‌లో ఉన్న కేసు సంబంధిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం సీసీటీఎన్ఎస్, సైబర్ క్రైమ్, రిసెప్షన్, కోర్టు డ్యూటీ తదితర విభాగాల పనితీరుపై సమీక్ష జరిపి సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది గౌరవంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పరిధిలో జరిగే ఆర్థిక నేరాలు, దొంగతనాల కేసుల దర్యాప్తును నిష్పాక్షికంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కొమురవెల్లి ఎస్ఐ మహేష్ మరియు సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ రమేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంసాన్ పల్లి పరిధిలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా అంతరాయం

విద్యుత్ శాఖ ఏఈ హైమద్ అలీ



కొల్చారం, నవంబర్ 5(సింగిడి): కొల్చారం మండలంలోని 33/11 కేవీ అంసాన్ పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేడు మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కొల్చారం విద్యుత్ శాఖ ఏఈ హమీద్ అలీ తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులతో పాటు నూతన ఏ బి స్విచ్ ఏర్పాటు పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

పరికి చెరువు చుట్టూ కంచె వేయడాన్ని స్వాగతిస్తున్నాం

సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



కుత్బుల్లాపూర్, నవంబర్ 5(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట, ఎల్లమ్మ బండ, గాజులరామారం, శ్రీనివాస్ నగర్ వరకు సుమారు 45 ఎకరాల్లో విస్తరించి ఉన్న పరికి చెరువును కాపాడాలని గత కొద్ది సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ, కలిసి వచ్చిన ఇతర పార్టీల ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామన్నారు. దానికి స్పందనగా గతంలో హైడ్రా కంచె వేస్తే అక్కడి కంచెను తొలగించి నిర్మాణాలు సాగుతున్నాయని తెలుసుకొని నేడు హైడ్రాధికారులు మరోసారి కంచి వేయడానికి రావడం హర్షించదగిన విషయమని బుధవారం సిపిఐ జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద తెలిపారు. అక్కడ ఏర్పాటైన కొన్ని ఇండ్లు గతంలో హైడ్రా కూల్చివేసినపటికి కబ్జాదారులు మరోసారి వాటిని నిర్మిస్తూ పక్కస్థలాలను కూడా సుమారు 20 నుంచి 30 లక్షలకు అమ్మి ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలా మోసపోయిన వారు గతంలో కొన్ని టీవీల ఎదురుగా కూడా చెప్పడం జరిగిందని, అయినప్పటికీ అధికారులు దానిపైన క్షుణ్ణంగా పరిశీలించకపోవడం వల్లే కబ్జాదారులను శిక్షించకపోవడం వల్లే మళ్లీ ఇలాంటి కొత్త నిర్మాణాలు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా హైడ్రాధికారులు పట్టిష్టమైనటువంటి కంచెను ఏర్పాటు చేసి వాటిని తొలగించిన వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. హైదరాబాదులో అనేక చెరువులను కాపాడి అందంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా పరికిచెరువును కూడా అందంగా తీర్చిదిద్దాలని అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోకపోవడం జగద్గిరిగుట్ట వాసులకు అనేక అనుమానాలకు దారితీస్తుందన్నారు. ఆ అనుమానాలను నివృత్తి చేసేలా నేడు హైడ్రాధికారులు కంచెను వేయాలని తద్వారా భవిష్యత్ తరాలకు నీటి అవసరాలను తీర్చిదిద్దుతున్నట్లు అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు ప్రవీణ్ అధ్యక్షులు బాబు యువజన సంఘం కార్యదర్శి కీర్తిలు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజా వీరుడు 'పండుగ సాయన్న' విగ్రహ ప్రతిష్టకు శ్రీకారం



కొమురవెల్లి నవంబర్ 5(సింగిడి): సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాసులాబాద్ గ్రామంలో తెలంగాణ ప్రజా వీరుడు, 'తెలంగాణ రాబిన్ హుడ్' పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు రాసులాబాద్ ముదిరాజ్ యూత్ ఆధ్వర్యంలో భూమి పూజ ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ అనూష, మాజీ జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారీ మరియు గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘ నాయకులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ. నిజాం దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి, పేదల ఆకలి తీర్చిన మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని, సాయన్న విగ్రహాన్ని గ్రామంలో ప్రతిష్టించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువసేన సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సంఘ భవన నిర్మాణానికి స్థలం గుర్తింపు

- గ్రామసభలో తీర్మానం.. ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత
- మహిళా సంఘాలకు నూతన భవనం నిర్మించాలి
- 52 మహిళా సంఘాలకు సమైక్య భవనం కల్పించాలి
- మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామంలో బుధవారం సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళా గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో రెండు వీవోలు, సుమారు 52 మహిళా సంఘాలు ఉన్నప్పటికీ సమావేశాల నిర్వహణకు సరైన భవనం లేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ తెలిపారు. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తించి గ్రామసభలో తీర్మానం చేశారు. అలాగే వి బి జి రామ్ జీ పథకం ద్వారా సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు మంజూరు చేయాలని ఎంపీడీవో పరిణతకు గ్రామ తీర్మాన పత్రాన్ని అందజేసి విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సుమారు 700 జాబ్ కార్డులు ఉండగా వేసవిలో రోజుకు 200 మంది వరకు ఉపాధి పనులకు వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ మహిళా సాధికారత, అక్షరాస్యత, ఆరోగ్యం, బాల్యవివాహాల నివారణపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు మంజుల నూతన భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తూ తీర్మానం చేసినందుకు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీ, వార్డు సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, జయమ్మ, మహిళా సంఘం కోశాధికారి శ్రావణి, శిరీష, సావిత్రి, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యపై స్పందించిన పంచాయతీరాజ్ అధికారులు..

- ఆదర్శనగర్ కాలనీ సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం పూర్తి
- రూ.10 లక్షలతో నిర్మాణ పనులు పూర్తి.. త్వరలోనే అందుబాటులోకి
- ప్రజల ఇబ్బందులను గుర్తించి ప్రత్యామ్నాయంగా పనులు చేపట్టిన డీఈఈ భాస్కర్



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సకాలంలో స్పందిస్తే ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందనే దానికి వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఆదర్శనగర్ కాలనీలో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణమే నిదర్శనంగా నిలుస్తోంది. కాలనీలో సెప్టిక్ ట్యాంక్ సౌకర్యం లేకపోవడంతో స్థానికులు కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సెప్టిక్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ, తొలుత పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిర్మాణం ప్రారంభం కాలేదు. దీంతో కాలనీవాసుల ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఈ విషయాన్ని కాలనీ అసోసియేషన్ సభ్యులు పంచాయతీరాజ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్ ప్రజల సమస్యను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. మొదట పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ జాప్యం చేస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా మరో కాంట్రాక్టర్ ద్వారా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. అధికారుల చొరవతో సుమారు రూ. 10 లక్షల వ్యయంతో సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులు తాజాగా పూర్తయ్యాయి. దీంతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న కాలనీవాసుల సమస్యకు పరిష్కారం లభించనుంది. త్వరలోనే సెప్టిక్ ట్యాంక్‌ను వినియోగంలోకి తీసుకురానున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పనులను ప్రత్యామ్నాయ మార్గంలో పూర్తి చేయించిన పంచాయతీరాజ్ శాఖ అధికారుల చొరవపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి నిర్మాణం పూర్తి చేయించడం అభినందనీయమని స్థానికులు పేర్కొంటున్నారు.

జంగారెడ్డి నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారిలక్ష్మారెడ్డి



కాప్రా, నవంబర్ 5(సింగిడి): ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తండ్రి బండారి జంగారెడ్డి 21 వ వర్ధంతి సందర్భంగా బుధవారం చీర్యాల లోని బండారి వ్యవసాయ క్షేత్రం లో జంగారెడ్డి సమాధి వద్ద ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండారి నర్సింహా రెడ్డి, నీలం రెడ్డి, వెంకట్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు..

ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర పొందండి

ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి



కొమురవెల్లి నవంబర్ 5(సింగిడి): కొమురవెల్లి, మండలాల్లోని పలు గ్రామాల్లో మర్రి ముస్త్యాల, గౌరయపల్లి, కొమురవెల్లి, రాంసాగర్, అయినాపూర్, గురువన్నపేట, కిష్టంపేట, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలి. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా గోనె సంచులు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచాలని. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహాదేవుని శ్రీనివాస్, మంజ మల్లేష్, దాసరి శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, ఏపిఎం, సి సీ, సి ఎ, ఐ కె పి,సిబ్బంది మరియు రైతులు.

వికారాబాద్ జిల్లా అనంతగిరిపల్లి టీఎస్ డబ్ల్యూ ఆర్ స్కూల్‌లో 12వ జోనల్ మీట్ సెలక్షన్స్



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 5(సింగిడి): వికారాబాద్ జిల్లా టీఎస్ డబ్ల్యూ ఆర్ స్కూల్ 12వ జోనల్ మీట్ సెలెక్షన్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వికారాబాద్ అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, నేషనల్ వాలీబాల్ ప్లేయర్ (పాత విద్యార్థి) పెద్దింటి నవీన్ కుమార్ హాజరైయ్యారు. సెలక్షన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలకు సమాజంలో మంచి భవిష్యత్తు ఉంటుందని, తాను కూడా సోషల్ వెల్ఫేర్ స్కూల్లో చదివి ఈ స్థాయికి చేరానని పేర్కొంటూ విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. అలాగే తన గురువైన పీడీ చందర్ ఇతరులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జనరల్ సెక్రెటరీ విజయభాస్కర్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ అమరేందర్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ ,సప్న, నర్సింలు, స్కూల్ ప్రిన్సిపాల్ రమాదేవి, పీడీ చందర్ మరియు పీఈటీలు పాల్గొన్నారు.

Cinma సింగిడి
శుక్రవారం
6-11-2026

ఓటీటీలోకి '418'..

స్ట్రీమింగ్ ఎప్పటినుంచంటే?

సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పణలో తెరకెక్కిన లేటెస్ట్ హారర్ మూవీ '418'. యంగ్ డైరెక్టర్ నాదగౌడ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, చైత్ర ఆచార్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి వెంకీ జీజీ తనదైన నేపథ్య సంగీతంతో భయపెట్టగా.. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మించింది. భారీ అంచనాల నడుమ అక్టోబర్ 23న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను నుంచి మిక్స్‌డ్ టాక్‌ను రాబట్టింది. ఇక థియేటర్లలో సందడి చేసిన ఈ హారర్ మూవీ, ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైనట్లు టాక్. ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ ఓటీటీ హక్కులను ప్రముఖ సంస్థ 'నెట్‌ఫ్లిక్స్' దక్కించుకున్నట్లు సమాచారం. నవంబర్ 20 నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తోంది.







అది ఉండాలి...

మాళవిక మోహనన్

కోలీవుడ్ బ్యూటీ మాళవిక మోహనన్ తెలుగు, తమిళ భాషల్లో వరుసగా క్రేజీ ఆఫర్లు అందుకుంటున్నప్పటికీ, గత కొద్ది కాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన హిట్ మాత్రం దక్కించుకోలేకపోతున్నారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి సరసన 'పాకెట్ నావల్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. త్యాగరాజన్ కుమార రాజా దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రానికి ఇళయరాజా సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా మాళవిక మోహనన్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టేటప్పుడు ప్రతీ ఒక్కరికీ 'ఓం శాంతి ఓం' లాంటి సినిమాలో పెద్ద సూపర్‌స్టార్‌తో డెబ్యూ ఇవ్వాలని, ఒక పర్ఫెక్ట్ గ్రాండ్ ఎంట్రీ ఉండాలని కోరిక ఉంటుందని ఆమె చెప్పుకొచ్చారు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాలు, విన్న మాటలే అలాంటి ఆలోచనలు మనలో పెంచుతాయని అన్నారు. అయితే ఇండస్ట్రీ అనుభవంతో తనకు ఒక విషయం స్పష్టంగా అర్థమైందని మాళవిక తెలిపారు. ఇక్కడ 'పరిపూర్ణమైన సినిమా' అనేది ఏదీ ఉండదని, కాబట్టి మూవీ హిట్ కావడం అనేది కేవలం అదృష్టం మీద ఆధార పడి ఉంటుందని పేర్కొన్నారు. ఎంత పెద్ద దర్శకుడితో చేసినా, ఎంత పెద్ద హీరోతో నటించినా కొన్నిసార్లు సినిమా ఆడకపోవచ్చని తెలిపారు. అందుకు చాలా రకాల కారణాలు ఉంటాయని.. అవన్నీ పక్కన పెడితే.. మన చేతుల్లో ఉన్నది కేవలం మన పనిని మనం నిజాయితీగా, కష్టపడి చేయడం మాత్రమే అని మాళవిక మోహన్ స్పష్టం చేశారు.

తెలుగు నటిగా గర్విస్తున్నా

పాయల్ రాజ్‌పుత్

టాలీవుడ్ హాట్ బ్యూటీ పాయల్ రాజ్‌పుత్ తెలుగు,తమిళ, హిందీ, పంజాబీ ఇండస్ట్రీలో పలు చిత్రాల్లో నటించి విపరీతమైన క్రేజ్ రాబట్టుకుంది. తెలుగులో ఆర్ఎక్స్-100, మంగళవారం వంటి సెన్సేషనల్ హిట్స్ తన ఖాతాలో వేసుకున్న ఈ భామ.. సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటోంది. షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ పలు విషయాలపై రియాక్ట్ అవుతోంది. తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసుకున్న పాయల్ రాజ్‌పుత్. తాజాగా, పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తెలుగు నటిగా తాను ఎంతో గర్విస్తున్నానని స్పష్టం చేసింది. మనకు పేరు ప్రఖ్యాతలు, గుర్తింపు ఇచ్చిన పరిశ్రమ నుంచి ప్రతి ఒక్కటి పొందిన తర్వాత, ఇన్నాళ్లకు వచ్చి మొత్తం తెలుగు వ్యవస్థనే నిందించడం అనేది కేవలం అసంబద్ధమైన ద్వేషం తప్ప మరొకటి కాదని తేల్చి చెప్పింది. టాలీవుడ్ తనను ఈ రోజు ఈ స్థాయిలో నిలబెట్టిందని, తన ఎదుగుదలకు అండగా నిలిచిన ఈ పరిశ్రమకు తాను ఎప్పటికీ అండగానే ఉంటానని పాయల్ పేర్కొంది.

కార్తీక్ ఆర్యన్ 'లడాకూ'

రిలీజ్ డేట్ ఫిక్స్..

ఆసారైనా సక్సెస్ దక్కుతుందా?



బాలీవుడ్ యంగ్ స్టార్ కార్తీక్ ఆర్యన్, డైరెక్టర్ కబీర్ ఖాన్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ కాబోతోంది. వీరిద్దరి క్రేజీ కాంబోలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'లడాకూ'. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'చందూ ఛాంపియన్' చిత్రం భారీ అంచనాల మధ్య వచ్చినప్పటికీ బాక్సాఫీసు వద్ద ఆశించినంత స్థాయిలో రాణించలేకపోయింది. అయినప్పటికీ మరోసారి ఈ జోడీ సరికొత్త కథతో బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతోంది. నిజజీవితంలో జరిగిన కొన్ని అసాధారణ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఆశయం, పట్టుదల, ఆశ అనే అంశాల చుట్టూ అత్యంత స్ఫూర్తిదాయకంగా ఈ కథ సాగనుందని సమాచారం. బిర్లా స్టూడియోస్, కబీర్ ఖాన్ ఎంటర్‌టైన్‌మెంట్స్, డోపమైన్ స్టూడియోస్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. అయితే హీరోగానే కాకుండా ఈ సినిమాతో కార్తీక్ ఆర్యన్ నిర్మాతగా కూడా తొలి అడుగు వేస్తుండటం విశేషం. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను 2027 జూన్ 18న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala Mohan, PRGI.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737

singidinews@gmail.com